కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రపంచానికి అహింసా సిద్ధాంతాన్ని చాటిచెప్పిన మహనీయుడు గాంధీజీ అని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన గాంధీ జయంత్యుత్సవాల్లో భాగంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహాత్ముడు అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారని, ఆయన చూపిన శాంతి మార్గం అందరికీ ఆదర్శనీయమన్నారు. బాపూజీ స్ఫూర్తితో పల్లెల్లో స్వచ్ఛత, స్వావలంబనకు కృషిచేయాలని అధికారులకు సూచించారు. కలెక్టరేట్ ఏఓ ఎం.రమాదేవి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఇందిర, జిల్లా మైనార్టీ అధికారి సంజీవరావు, జిల్లా యువజన, క్రీడల అధికారి పరంధామరెడ్డి, డీపీఆర్వో అజ్జర్ అలీ, స్వాతంత్ర సమరయోధులు పాల్గొన్నారు.

## మహాత్ముడి అహింసా మార్గం అనుసరణీయం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో మహాత్మాగాంధీజీ చిత్రపటానికి ఐటీడీఏ పీఓ రాహుల్, ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ నివాళి అర్పించారు. ఐకమత్యమే మహా బలమని, ఆయన చూపిన అహింసామార్గం ఆచరణీయమని అభిప్రాయపడ్డారు. గ్రామ స్వరాజ్యం సాధనకు అందరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు.


కలెక్టరేట్‌లో గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ తదితరులు


భద్రాచలం: ఐటీడీఏ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న పీఓ రాహుల్, అధికారులు


## ఇక సర్వేత్రా..
## సమాచారం నిక్షిప్తం

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం, న్యూస్‌టుడే, కొత్తగూడెం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న కుటుంబ డిజిటల్ కార్డు రూపకల్పన ప్రక్రియకు రంగం సిద్ధమైంది. ప్రతి కుటుంబానికి ప్రత్యేకంగా డిజిటల్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. ఈనేపథ్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పది శాసనసభ నియోజకవర్గాల్లో పైలెట్ ప్రాజెక్టుగా 20 ప్రాంతాల్లో ఇంటింటి సర్వేకు అధికారులు గురువారం శ్రీకారం చుట్టనున్నారు. సోమవారం వరకు సర్వే జరగనుంది. రేషన్, ఆరోగ్యం, సంక్షేమ పథకాలన్నింటికీ ఉపయోగపడేలా కార్డులను రూపొందించి లబ్ధిదారులకు అందించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులోనే కుటుంబ సభ్యులందరి ఆరోగ్య సమాచారం పొందుపరచనున్నారు.

### ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో..

డిజిటల్ కార్డుల రూపకల్పన పైలెట్ ప్రాజెక్టును పకడ్బందీగా నిర్వహించేందుకు ఉభయ జిల్లాలకు ఐఏఎస్ స్థాయి ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. వీరి పర్యవేక్షణలోనే సర్వే సాగనుంది. వీరికి సహాయకులుగా ప్రతి శాసనసభ నియోజవర్గానికి ఒక నోడల్ అధికారి, మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓలతో కూడిన ప్రత్యేక బృందాలు పనిచేయనున్నాయి. నియోజకవర్గం నుంచి ఒక గ్రామీణ, ఒక పట్టణ ప్రాంతాన్ని ఎంపిక చేసిన అధికారులు ఆయా చోట్ల నివసిస్తున్న కుటుంబాల సంఖ్య ఆధారంగా సర్వే ప్రణాళికలు రూపొందించారు. ఐదు రోజుల్లో సర్వే పూర్తిచేయటానికి అవసరమైతే అదనపు బృందాలను నియమించనున్నారు.




### సర్వే సాగనుందిలా..

డిజిటల్ కార్డుల సర్వేలో భాగంగా కుటుంబంలో ఎంతమంది ఉన్నారు? వారి మధ్య ఉన్న సంబంధం ఏంటి అనే వివరాలు నమోదుచేయనున్నారు. కుటుంబంలో ఎక్కువ వయసు కలిగిన మహిళలు కుటుంబ పెద్దగా ఉండనున్నారు. కుటుంబంలోని ప్రతి సభ్యునికి గుర్తింపు సంఖ్య ఇస్తారు. కుటుంబంలోకి కొత్తగా వచ్చిన, జన్మించిన పిల్లల వివరాలు నమోదు చేయటంతో పాటు వివాహం చేసుకొని ఇతర చోటుకు వెళ్లిపోయిన లేదా చనిపోయిన వారి వివరాలు తొలగించనున్నారు. కుటుంబ సభ్యుల అనుమతితో బృంద ఫొటో తీసుకోనున్నారు.

**భద్రాద్రి జిల్లాలో సర్వే చేయనున్న ప్రాంతాల వివరాలు..** కుటుంబ డిజిటల్ కార్డులు జారీ చేసేందుకు పైలెట్ ప్రాజెక్టులో భాగంగా భద్రాద్రి జిల్లాలో ఏడు గ్రామాలు, మూడు పురపాలికల్లోని వార్డులను అధికారులు ఎంపిక చేశారు. ◆ ఇల్లెందు మండలం పూబెల్లి పంచాయతీలో 172 కుటుంబాలు, ఇల్లెందు పురపాలికలోని 19వ వార్డులోని 310 కుటుంబాలు. ◆ లక్ష్మీదేవిపల్లి మండలం లాల్‌తండా పంచాయతీలో 171 కుటుంబాలు, పాల్వంచ పురపాలికలోని పదో వార్డులో 330 కుటుంబాలు. ◆ దమ్మపేట మండలం అల్లిపల్లి పంచాయతీలోని 175 కుటుంబాలు, ములకలపల్లి మండలం ముత్యాలంపాడు పంచాయతీలోని 178 కుటుంబాలు. ◆ చర్ల మండలం పులిగుండాల పంచాయతీలోని 190 కుటుంబాలు, భద్రాచలం పంచాయతీలోని తొమ్మిదో వార్డులో 280 కుటుంబాలు. ◆ అశ్వాపురం మండలం సందర్లబోడు పంచాయతీలోని 190 కుటుంబాలు, మణుగూరు పురపాలికలోని ఆరో వార్డులో 248 కుటుంబాలు.

కుటుంబ డిజిటల్ కార్డు సర్వేకు అన్ని చర్యలు తీసుకున్నాం. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసిన గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు గురువారం నుంచి సర్వే నిర్వహించనున్నాయి.
– డి.వేణుగోపాల్, అదనపు కలెక్టర్

### పకడ్బందీగా చేపట్టాలి: కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్: డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అధికారులను బుధవారం ఆదేశించారు. అంతకు ముందు జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్ హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌తో కలిసి కలెక్టరేట్‌లో హాజరయ్యారు. గ్రూప్ ఫొటోలను అనుమతితో సేకరిస్తామన్నారు. నోడల్ అధికారులుగా ఆర్డీఓ మధు (కొత్తగూడెం), దామోదర్‌రావు (భద్రాచలం), గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రనాథ్ (పినపాక), స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ (అశ్వారావుపేట), స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కాశయ్య(ఇల్లెందు) వ్యవహరిస్తారని చెప్పారు.


# ప్లాస్టిక్ వ్యాప్తికి ఇటుకతో సమాధి!


ఈనాడు డిజిటల్, కొత్తగూడెం

నిషేధిత ప్లాస్టిక్‌ను ఎందుకు వినియోగిస్తున్నారని ఎవరినైనా ప్రశ్నిస్తే.. 'నేనొక్కడినే మారితే సరిపోతుందా ఏంటీ'.. అనే సమాధానం వస్తుంది. ఇలా ఒక్కొక్కరుగా చూపే నిర్లక్ష్యమే చివరకు ప్లాస్టిక్ భూతం పర్యావరణాన్ని కబళించేలా చేస్తోంది. దశాబ్దంన్నర క్రితం వరకు పెద్దగా వాడకం లేని నిషేధిత ఉత్పత్తుల వ్యర్థాలు నేడు పల్లె, పట్టణమనే తేడా లేకుండా గుట్టలుగా పోగుపడుతున్నాయి. కాలువల్లో, ఖాళీ ప్రదేశాల్లో, అడవుల్లో, నదుల్లో.. అంతటా వాటి జాడలే. అయినా ఉభయ జిల్లాల ప్రజల్లో చైతన్యం శూన్యం. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ పునర్వినియోగంపై భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ చేస్తున్న ప్రయోగాలు, ప్రయత్నాలు ఆలోచింపజేస్తున్నాయి. మున్సిపాలిటీల్లో బయోమైనింగ్ ప్లాంట్లు, 'పర్యావరణహిత ఇటుకల(ఎకో బ్రిక్స్)' తయారీతో వ్యర్థాల వ్యాప్తికి 'అడ్డుగోడ' కట్టాలని ఆయన యోచిస్తున్నారు. ఈ ప్రయత్నం ఖమ్మం జిల్లాలోనూ అనుసరణీయమని పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు.

### తయారీ.. విక్రయాలను అరికడితేనే..

ప్లాస్టిక్ వ్యర్థాల తయారీ, విక్రయాలపై అధికార యంత్రాంగం దృష్టిసారించాలి. ఇతర రాష్ట్రాల్లోంచి గుట్టల కొద్దీ దిగుమతి చేసుకునే ఉత్పత్తులతో గుట్టుగా గోదాములను నింపుతుంటే.. 'నవ్విపోదురు గాక మాకేటి సిగ్గు' అన్నచందాన కిమ్మనకుండా ఉంటే అసలుకే మోసం వస్తుంది. కొందరు నిషేధిత ఉత్పత్తుల రిటైల్ వ్యాపారాన్ని యథేచ్ఛగా సాగిస్తున్నారు. అధికారులేమో నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారు. ఉభయ జిల్లాల్లోని నగర, పురపాలికల్లో ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగం ఇంకా పెచ్చరిల్లుతోంది. వివాహాది కార్యాల్లో పెద్ద ఎత్తున వాడుతున్నా పట్టింపు లేదు. ఫలితంగా ఆయా వ్యర్థాలు డంపింగ్ యార్డులతో పాటు డ్రైనేజీలను ముంచెత్తుతున్నాయి. ఈ కారణంగానే ఖమ్మం, మణుగూరులోని పలు కాలనీలను ఇటీవల వరద ముంచెత్తింది. ఒకసారి వాడిపారేసే కవర్లు, బాటిళ్ల వినియోగానికి ప్రజలు చైతన్యంతో దూరంగా మెలగాలని అధికారులు సూచిస్తున్నారు.





ఎకో బ్రిక్స్‌తో నిర్మించిన నమూనా ఇల్లు

### తరుణోపాయాలివే..

శుభకార్యాలకు స్టీలు సామగ్రిని అందజేసే 'బర్తన్' బ్యాంకులను పాల్వంచ పురపాలిక, ఖమ్మంలో పలుచోట్ల ప్రారంభించారు. వీటిని అన్ని పట్టణాలు, నగరాల్లోని మిగతా వార్డుల్లో వీలైనన్ని ప్రారంభించాలి. ఇక్కడి సామగ్రిని కాలనీ వాసులు శుభకార్యాలకు వినియోగించేలా ప్రోత్సహించాలి. ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండే వ్యాపారులను రాయితీలతో ప్రోత్సహించాలి. ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. స్వయం సహాయక సంఘాలకు 'మహిళా శక్తి' పథకం కింద జనపనార, వస్త్ర సంచుల యూనిట్లు మంజూరుచేయాలి. వారి ఉత్పత్తులకు స్థానికంగా మంచి మార్కెటింగ్ కల్పిస్తే ఉపాధి మార్గాలూ మెరుగవుతాయి. ఇల్లెందు పట్టణంలో రూ.10లక్షలకు పైగా వెచ్చించి తెప్పించిన బయోమైనింగ్ యంత్రాన్ని వినియోగంలోకి తేనేలేదు. దీనిపై దృష్టిపెట్టడమే కాదు, అన్ని పురపాలికల్లో ఘనవ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు నెలకొల్పి ప్లాస్టిక్ పునర్వినియోగానికి చిత్తశుద్ధితో ప్రయత్నించాలి. ప్రధాన ఆదాయ వనరుగా మలచాలి. ఖాళీ బాటిళ్లలో కవర్లను కుక్కి ఇటుకలుగా వాడే 'ఎకో బ్రిక్స్' తయారీపై ఉద్యమస్థాయిలో చైతన్యం పెంపొందాలి. ఇందుకు విద్యాలయాలు వేదికలుగా నిలవాలి. ఈ క్రతువు తమ ముఖ్య బాధ్యత అని పంచాయతీ, పట్టణ సిబ్బంది, పాలకవర్గాలు గుర్తెరిగేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి.

## బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..

మణుగూరు: సుందరయ్యనగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మలతో మహిళలు, యువతులు ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను స్థానిక జలాశయాల్లో నిమజ్జనం చేశారు. – మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

## ఏకలవ్య గురుకుల పాఠశాల ప్రారంభం

టేకులపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు కల్పిస్తున్న విద్యావకాశాలను గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. టేకులపల్లి ఏకలవ్య (ఈఎంఆర్ఎస్) పాఠశాలను ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో బుధవారం ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్, ఎమ్మెల్యేలు జ్యోతి వెలిగించారు. పేద విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలపడమే ఏకలవ్య పాఠశాలల లక్ష్యమని తెలిపారు. ఓఎస్డీ కృష్ణారావు, ఆర్‌సీఓ నాగార్జునరావు, ఏఈ సీపీడబ్ల్యూడీ చందర్‌రావు, ఇల్లెందు డీఎస్పీ చంద్రబాను, తహసీల్దార్ కె.నాగభవాని, ఎంపీడీఓ రవీందర్‌రావు, సీఐ తాటిపాముల సురేశ్, ఎస్సై పి.సురేశ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, పక్కన ఎమ్మెల్యే కోరం తదితరులు

# పదే పదే.. అదే మోసం

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

ఆశ ఒక మనిషిని ఎంతదూరమైనా తీసుకెళ్తుందంటారు. అదీ, కుటుంబానికి భద్రత కల్పించే కొలువైతే.. కొందరు నిరుద్యోగ యువత అప్పులు చేసైనా దళారులు అడిగినంత ముట్టజెప్పేందుకు సిద్ధపడుతున్నారు. తప్పని తెలిసినా తప్పదనే భావనతో ఒకరిని చూసి మరొకరు ఇలా ప్రలోభాల వలలో చిక్కుకుంటున్నారు. చివరకు నిట్టనిలువునా మోసపోతున్నారు. ఆర్థికంగా అప్పుల్లో కూరుకుపోయి, గట్టెక్కే దారిలేక తీవ్ర నిర్ణయాలు తీసుకుంటున్నారు. జూలూరుపాడుకు చెందిన రత్నకుమార్, పార్వతి దంపతుల విషాదాంతమే ఇందుకు ఉదాహరణ. ప్రభుత్వ కొలువు దక్కాలనే ఉద్దేశంతో ఓ దళారీని నమ్మి ఏకంగా రూ.16 లక్షలు ముట్టజెప్పారు. స్థానికత, సింగరేణి కారుణ్య నియామకాల ఆశజూపి కాసులు కాజేసిన దళారీ చనిపోవటం, మధ్యవర్తి ముఖం చాటేయటంతో ఏంచేయాలో రత్నకుమార్‌కు పాలుపోలేదు. కొలువు భ్రమలో అప్పులపాలై దంపతులిద్దరూ బలవన్మరణానికి పాల్పడ్డారు. దళారులను నమ్మొద్దని సింగరేణి, కేటీపీఎస్ వంటి సంస్థలు, పోలీసులు ఎంతచెప్పినా మారని వారికి ఈ ఘటనే ఓ గుణపాఠం.

నిఘా

### ఆశ పుట్టించి.. ఆపై పలాయనం చిత్తగించి..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిశ్రమలకు నెలవు. ముఖ్యంగా సింగరేణి, విద్యుత్తు కేంద్రాలైన కేటీపీఎస్, బీటీపీఎస్‌లో కారుణ్య, ఒప్పంద కొలువుల పేరిట దళారులు నిరుద్యోగ యువతను మోసగించటం పరిపాటిగా మారింది. అధిక వేతనాలు, అంతకు మించి ఉద్యోగ భద్రత భ్రమలో పడి కొందరు భారీమొత్తంలో డబ్బు ముట్టజెప్పుతున్నారు. అదిగో.. ఇదిగో అని కొంతకాలం తిప్పుకొనే దగాకోరులు చివరకు పలాయనం చిత్తగిస్తున్నారు. గట్టిగా నిలదీస్తే ఎంతో కొంత ముట్టజెప్పి చేతులు దులిపేసుకుంటున్నారు. రత్నకుమార్ దంపతుల బలవన్మరణ ఘటన నేపథ్యంలోనైనా దళారుల్లో ప్రాయశ్చిత్తం కలగాలి. ఇలాంటి వారి ఆటకట్టించేందుకు పోలీసులు, పరిశ్రమల విజిలెన్స్ విభాగాలు నిఘాను పటిష్ఠపరచాలని ప్రజలు కోరుతున్నారు.



● సింగరేణిలో ఉద్యోగాలిప్పిస్తానని నమ్మబలికి మధ్యవర్తుల ద్వారా కొత్తగూడెం రుద్రంపూర్‌కు చెందిన ఓ దళారీ పెద్దఎత్తున డబ్బులు దండుకున్నాడు. మోసపోయామని గుర్తించిన బాధితులు రెండేళ్ల క్రితం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.
● ఒప్పంద ఉద్యోగాల పేరిట గతేడాది కొంతమంది దగ్గర ఓ నాయకుడు డబ్బు వసూలు చేశాడు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.
● 'కారుణ్య' కొలువులు ఇప్పిస్తామని పలువురి వద్ద డబ్బులు వసూలు చేశాడన్న ఆరోపణతో ఓ ఉద్యోగిని ఇటీవల యాజమాన్యం విధుల్లోంచి తొలగించింది.
● ఉద్యోగాలిప్పిస్తామంటే నమ్మి.. అప్పుచేసి రూ.లక్షలు ముట్టజెప్పిన జూలూరుపాడుకు చెందిన రత్నకుమార్, పార్వతి దంపతులు తాము నిలువునా మోసపోయామని బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన గత సోమవారం చోటుచేసుకుంది.

### ప్రలోభపెడితే పోలీసులకు ఫిర్యాదు చేయండి

సింగరేణిలో ఉద్యోగాలన్నీ పారదర్శకంగా భర్తీ చేస్తారు. ఎవరైనా దళారులు ప్రలోభపెట్టినా, డబ్బులు వసూలుచేసినా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆ సంస్థ 'పా' విభాగం డైరెక్టర్ ఒకరు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఒకవేళ సింగరేణి ఉద్యోగి మోసానికి పాల్పడితే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# పోటీలకు సై..
## రాష్ట్రస్థాయి క్రీడలకు జిల్లా జట్లు సిద్ధం

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జట్లను ఎంపిక చేస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పోటీలు నిర్వహించి ఉమ్మడి జిల్లాల నుంచి ఒక జట్టును రాష్ట్రస్థాయికి పంపుతారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పూర్తయింది. మిగతా క్రీడాంశాల్లో ఎంపిక చేయాల్సి ఉంది. పాఠశాల క్రీడలు నిర్వహించే 'రాష్ట్ర పాఠశాల క్రీడా సమాఖ్య' రాష్ట్రంలోని పాత పది జిల్లాలను మాత్రమే పరిగణనలోకి తీసుకొని రాష్ట్ర టోర్నీలు నిర్వహించేందుకు సిద్ధమైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు మాత్రమే రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తుంది. పాఠశాల క్రీడా సమాఖ్య జాబితాలో 46 క్రీడాంశాలు ఉన్నాయి. రెండు జిల్లాలోని జిల్లా క్రీడా సమాఖ్యలు చెరి 23 అంశాల పోటీలు నిర్వహించుకోవాలని ఒప్పందం చేసుకున్నాయి. వీటిలో క్రీడా జట్లు ఎక్కువగా ఉండే కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ అంశాలకు మాత్రమే పోటీలు నిర్వహించారు. మిగిలిన అంశాల్లో ఎంపికలు జరగనున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్-14 బాలుర క్రికెట్ జట్టు కొత్తగూడెంలో నిర్వహించగా అండర్-17 క్రికెట్ జట్టుకు ఖమ్మంలో పోటీలు జరగనున్నాయి. ఇలాంటి ఎంపికలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏ ప్రాంతంలో జరిగినా ఆయా ప్రాంతాల క్రీడాకారులు పాల్గొనాల్సి ఉంటుంది. ఇలా ఎంపికల ద్వారా సిద్ధం చేసే జట్టు, ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టుగా రాష్ట్ర పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తుంది.



### ఇంటర్ విద్యార్థులకూ అవకాశం

ఇంటర్మీడియట్ విద్యార్థులను అండర్-19 విభాగంగా పరిగణిస్తున్నారు. వీరిని ప్రత్యేకంగా నిర్వాహక కమిటీ, ఇంటర్మీడియట్ విద్యాధికారి పర్యవేక్షిస్తారు. ఇంటర్‌లో చేరిన విద్యార్థులు 17 ఏళ్లలోపు ఉంటే పాఠశాల అండర్-17 జట్లలో పాల్గొనేందుకు అర్హులు. జనవరి 1, 2008 తర్వాత జన్మించిన వారికి అండర్-17 పోటీలు, ఎంపికల్లో పాల్గొనే అవకాశం ఉంది.

### మార్పులు ఇలా..

2019 కొవిడ్ విధ్వంసం తర్వాత ఈఏడాది తొలిసారిగా ఉభయ జిల్లాల్లో పాఠశాల క్రీడలు జరిగాయి. ఇంకా జిల్లా జట్లను సిద్ధం చేసేందుకు ఎంపికల నిర్వహణ ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ చొరవ తీసుకొని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు ఓ ప్రత్యేక కార్యాలయ వసతి కల్పించారు. దశాబ్దాలుగా ఓ కార్యాలయం లేకుండానే సమాఖ్య పనులు సాగించింది. ఈ ఏడాది ఖమ్మంలో నాలుగు అంశాలకు పరిమితంగా జిల్లా క్రీడలు నిర్వహించినప్పటికీ క్రీడాకారులకు భోజన వసతి కల్పించి, బాలికలు, బాలురకు విడివిడిగా పోటీలు జరిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్ల ఎంపికల ప్రక్రియ మొదలుపెడతామని, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పూర్తి సమాచారం కోసం తమను సంప్రదించాలని జిల్లా పాఠశాల క్రీడల కార్యదర్శి నర్సింహమూర్తి తెలిపారు.

## డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

పాల్వంచ: డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన తొలిరోజు బుధవారం ప్రశాంతంగా జరిగింది. కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ హైస్కూల్‌లో 150 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరి ధ్రువపత్రాలను రాష్ట్ర ప్రత్యేక పరిశీలకులు శ్రీనివాసాచారి, డీఈఓ వెంకటేశ్వరాచారి పర్యవేక్షణలో అధికారులు పరిశీలించారు. ఏఎంఓ నాగరాజశేఖర్, సెక్టోరియల్ అధికారులు సైదులు, సతీశ్‌కుమార్, ఎఫ్ఏఓ శ్రీనివాస్, ఎంఈఓలు పాల్గొన్నారు. పలువురు అభ్యర్థులు తమ కుటుంబ సభ్యులతో సహా హాజరయ్యారు. ఈనెల 1 నుంచి చేపట్టాల్సిన ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం అనివార్య కారణాలతో ఒకరోజు ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ నెల 5 వరకు కొనసాగుతుంది. జిల్లావ్యాప్తంగా 447 ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, పీఈటీ, స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులను భర్తీచేయనున్నట్లు డీఈఓ తెలిపారు.

## ఖమ్మం జిల్లాలో భారీ వర్షం

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఖమ్మంలో బుధవారం సాయంత్రం పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. వివిధ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఖమ్మం సహా రఘునాథపాలెం, వైరా, కూసుమంచి, తిరుమలాయపాలెం తదితర మండలాల్లో పెనుగాలులు వీచాయి. జిల్లాలోని ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లలో రాత్రి 7 గంటల వరకు నమోదైన వివరాల మేరకు... రఘునాథపాలెంలో అధికంగా 51.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. ముదిగొండ-37.3, పెనుబల్లి-36.5, పల్లెగూడెం-36.3, ఖమ్మంలో ఖానాపురం పోలీస్ స్టేషన్-34.0, తిరుమలాయపాలెం-33.0, పమ్మి-24.0, వి.వి.పాలెం న్యూ కలెక్టరేట్-23.5, తల్లాడ-23.0, ఖమ్మం ప్రకాశ్‌నగర్-20.0, చింతకాని-13.3, బచ్చోడు-10.8, గుబ్బగుర్తి-9.8, సదాశివునిపాలెం-8.5, కాకరవాయి-8.3, కుర్నవల్లి-8.0, పంగిడి-7.8, పెద్దగోపతి-6.3, కూసుమంచి-6.0, బాణాపురం, మంచుకొండ-5.5, గేట్ కారేపల్లి-3.0, నేలకొండపల్లి-2.8, లింగాల-2.3 మి.మీ. వర్షపాతం నమోదైంది.

# చేపా.. చేపా.. ఈసారైనా ఎదుగుతావా?

ఈటీవీ, ఖమ్మం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో చేపపిల్లల పంపిణీ పథకం ఎట్టకేలకు శుక్రవారం నుంచి మొదలుకానుంది. ఎంపిక చేసిన చెరువుల్లో చేపపిల్లలను ప్రజాప్రతినిధులు, అధికారులు వదలనున్నారు. గతేడాది చేపపిల్లల సరఫరాలో గుత్తేదారులపై ఆరోపణలు వెల్లువెత్తాయి. చేపపిల్లల సైజు, సంఖ్యలో భారీగా వ్యత్యాసమున్నట్లు ఖమ్మం కలెక్టర్ తనిఖీల్లో బయటపడింది. గుత్తేదారుల నిర్వాకంతో చేపపిల్లల ఎదుగుదల లేకపోవటంతో అనేక చెరువుల్లో మత్స్యకారులు వేట నిలిపేశారు. ఈసారైనా అలాంటి పొరపాట్లకు తావులేకుండా చేపపిల్లలను సరఫరా చేయాలని ఆకాంక్షిస్తున్నారు.

### లక్ష్యం ఇలా..

ఖమ్మం జిల్లాలో వాస్తవానికి 3.62 కోట్ల చేపపిల్లలను సరఫరా చేయాల్సి ఉండగా ఈసారి 1.75 కోట్లకు, భద్రాద్రి జిల్లాలో 1.77 కోట్ల చేపపిల్లలకు గాను 88 లక్షలకు లక్ష్యాన్ని కుదించింది.

గతంతో పోలిస్తే ఈసారి దాదాపు రెండు నెలల తర్వాత చేపపిల్లల విడుదల కార్యక్రమం చేపడుతుండటంతో లక్ష్యం తగ్గింది. పాత బకాయిల చెల్లించలేదన్న సాకుతో టెండర్లకు గుత్తేదారులు నిరాసక్తత ప్రదర్శించటం, వర్షాకాలానికి ముందే జరగాల్సిన టెండర్ ప్రక్రియ సెప్టెంబర్‌లో ముగియటంతో ఈసారి చేపపిల్లల విడుదల కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభమవుతోంది. ఖమ్మం జిల్లా పరిధిలోని పాలేరు జలాశయంలో చేపపిల్లలను వదిలే కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రారంభిస్తారు. భద్రాద్రి జిల్లా సుజాతనగర్ మండలం సింగభూపాలెం చెరువులో చేపపిల్లలను ప్రజాప్రతినిధులు, అధికారులు వదలనున్నారు.



### అవకతవకలకు ఆస్కారం ఉండొద్దు

ఉభయ జిల్లాల్లో గతేడాది చేపపిల్లల సరఫరాలో అవకతవకలు చోటుచేసుకున్నాయి. టెండర్ ప్రకారం కన్నా తక్కువ సైజు చేపపిల్లలు పంపిణీ చేశారని, సంఖ్యలోనూ భారీగా వ్యత్యాసముందని అధికారులు గుర్తించారు. చేపల ఎదుగుదల సరిగ్గా లేక అనేక చెరువుల్లో మత్స్యకారులు వేట నిలిపేశారు. ఈసీజన్‌లో భారీ వర్షాలు కురవటంతో చెరువులు నిండుకుండను తలపిస్తున్నాయి. అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తేనే చేపపిల్లల సరఫరా పారదర్శకంగా సాగుతుందని మత్స్యకారులు అభిప్రాయపడుతున్నారు.

| | ఖమ్మం | భద్రాద్రి |
|---|---|---|
| మత్స్య సహకార సంఘాలు | 210 | 63 |
| సభ్యులు | 16,500 | 2,963 |
| చెరువులు | 864 | 743 |
| ఈ ఏడాది వదిలే చేపపిల్లలు | 1.75 కోట్లు | 88 లక్షలు |

జిల్లాలో చేపపిల్లల విడుదల కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభిస్తాం. సింగభూపాలెం చెరువులో సుమారు లక్ష చేపపిల్లలను వదులుతాం. ఎంపిక చేసిన చెరువుల్లోనూ క్రమక్రమంగా చేపపిల్లలను వేస్తాం. అవకతవకలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. గుత్తేదారులు నిబంధనల ప్రకారం సైజు, సంఖ్య తగ్గకుండా చేపపిల్లలు సరఫరా చేసేలా పర్యవేక్షిస్తాం.
– ఇంతియాజ్, జిల్లా మత్స్యశాఖ అధికారి

## వానరాలన్నీ.. చేనుకు ఆవల వైపే!



ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం ఇమామ్‌నగర్‌కు చెందిన శ్యామ్‌లాల్ రైతు పంట చేను అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉంది. దీంతో కోతుల బెడద ఎక్కువైంది. తనకున్న పదెకరాల్లో ఆయిల్‌పాంతో పాటు వరి సాగుచేస్తున్నారు. పైరుకు రక్షణగా రూ.50 వేలతో ఇటీవల సోలార్ విద్యుత్తు తీగలు, వాటిపై వలను ఇలా ఏర్పాటు చేశారు. గత కొద్ది నెలలుగా కోతులు చేనులోకి రావడం లేదని శ్యామ్‌లాల్ పేర్కొన్నారు. – పాల్వంచ, న్యూస్‌టుడే

## బతుకు వేట.. జల్సాల బాట





కత్తి.. వైద్యుడి చేతిలో పడితే శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు నిలబెడుతుంది. దుర్మార్గుడి చేతిలో పడితే ప్రాణాలు తీస్తుంది. ఖమ్మం నగరంలో కనిపించిన పై దృశ్యాలు అచ్చం అలాంటివే. ద్విచక్ర వాహనాన్ని ఒకరు బతుకు దెరువు సాధనంగా మలుచుకోగా.. మరికొందరు గంజాయి దందాలకు వాడుకొని దొరికిపోతున్నారు. నగరానికి చెందిన సురేష్ తన ద్విచక్ర వాహనాన్ని ఐస్‌క్రీం పార్లర్‌గా మార్చుకున్నారు. వ్యాపారం ఆశాజనకంగా ఉందని చెబుతున్నారు. మరో చిత్రంలో గంజాయి కేసుల్లో పట్టుబడిన జల్సా రాయుళ్ల ఖరీదైన వాహనాలు పోలీసు కార్యాలయాల్లో మూలుగుతున్నాయి. – న్యూస్‌టుడే, ఖమ్మం సారథినగర్

## అవసరం తీరాలంటే.. నైపుణ్యంతో సాగాలంతే!!



ఆదివాసీలు తమ రోజువారీ అవసరాలను తీర్చుకునేందుకు ఎంతటి కష్టాన్నైనా భరిస్తుంటారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని గొత్తికోయ గ్రామం క్రాంతి నగర్‌లో సమీప చేతిపంపు నుంచి నీళ్లను ప్రత్యేక క్యాన్లు, బిందెల్లో తెచ్చుకుంటారు. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన సోలార్ బోరు సరఫరా నీటిని సరఫరా చేయలేకపోవడంతో గొత్తికోయ మహిళలు ఇలా నీళ్లను తెచ్చుకుంటున్నారు. మన్యంలో ఇలాంటి దృశ్యాలెన్నో కనిపిస్తుంటాయి. - లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే

## రామయ్యకు ఘనంగా తిరుమంజనం



**భద్రాచలం, న్యూస్‌టుడే:** భద్రాచలం శ్రీసీతా రామచంద్ర స్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారానికి ఒకసారి ఉండే తిరుమంజనం ఘనంగా కొనసాగించి భజనలతో ఆరాధించారు. అర్చకులు భక్తిశ్రద్ధలతో దేవదేవుడికి సుప్రభాతం పలికి నామార్చన చేశారు. క్షేత్ర విశిష్టతను ప్రవచించారు. నిత్య కల్యాణ విశిష్టతను వివరిస్తుండగా దీనికి అనుగుణంగా వైదిక పెద్దలు పూజలు చేశారు. జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక అమితానందకరంగా సాగాయి. హరిదాసుల కీర్తనలు, పండితుల వేద ఘోషతో దర్బారుసేవ తన్మయత్వాన్ని నింపింది. వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రధాన కోవెలలోని ధ్రువమూర్తులతో పాటు అనుబంధంగా ఉన్న ఆంజనేయుణ్ని, లక్ష్మీతాయారు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

**17న శబరిమాత ఉత్సవం:** అశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని భద్రాచలం రామాలయ ఆధ్వర్యంలో ఈనెల 17న శబరిమాత ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ రమాదేవి బుధవారం ప్రకటించారు. ఆ రోజు ఉదయం 6.30కు గిరి ప్రదక్షిణ నిర్వహించి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు వివరించారు. ఈ వేడుక సందర్భంగా 17న గిరిజన సంప్రదాయంలో అశ్వారావుపేట మండలంలోను ప్రత్యేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 8.30 గంటలకు అశ్వారావుపేట మండలం వినాయకపురంలో భద్రాచలం రామరథ శోభాయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. చిలకలగండి ముత్యాలమ్మ ఆలయానికి పది గంటలకు చేరుకుని అక్కడ సీతారామ కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## హోరాహోరీగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

**వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే:** వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. మొగిలిచర్ల మైదానంలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆదిలాబాద్ జట్టుపై ఖమ్మం జట్టు గెలుపొందింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆదిలాబాద్ జట్టు 29.3 ఓవర్లలో 109 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఖమ్మం జట్టు 30.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కోమటిపల్లి మైదానంలో ఖమ్మం, నిజామాబాద్ జట్ల మధ్య మ్యాచ్ గురువారం జరగనుంది.



గెలుపొందిన ఖమ్మం జట్టు

# దశదిశలు నిండుగా.. దసరా పండగ

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే



నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

తెలుగువారి పెద్ద పండగ విజయదశమి నేటి నుంచి ప్రారంభం కానుంది. శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాలు 3వ తేదీ నుంచి 13 వరకు వేడుకగా నిర్వహించనున్నారు. జిల్లాలోని అన్ని ప్రముఖ ఆలయాలు ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. అశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు తొమ్మిది రోజుల పాటు దుర్గామాత అమ్మవారికి ఆలయాలు, మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఖమ్మం నగరంలోని రోటరీనగర్, కాల్వొడ్డు, నాయుడుపేటతో పాటు ప్రధాన కూడళ్లలో కొద్దిరోజులుగా అమ్మవారి విగ్రహాల విక్రయాలు జరుగుతున్నాయి. నాలుగు రోజులుగా కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయని విక్రయదారులు చెబుతున్నారు. అడుగున్నర నుంచి 10 అడుగుల పైన దుర్గామాత విగ్రహాలను పలు రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి ఎత్తు, ఆకృతి ప్రకారం ధరను నిర్ణయించి విక్రయించారు. భక్తులు అమ్మవారి దీక్షామాలలను ధరించి విజయదశమి రోజున విరమిస్తారు.



గుట్టలబజారు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దీపాలంకరణలు

### రోజుకో అవతారం

శరన్నవరాత్రి తొమ్మిది రోజులు అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో అమ్మవార్లకు పూజలు చేయనున్నారు. స్తంభాద్రి శ్రీలక్ష్మీ నర్సింహస్వామి దేవస్థానంలో తొలిరోజు అమ్మవారు శ్రీఆదిలక్ష్మీ, రెండోరోజు శ్రీధాన్యలక్ష్మీ, మూడోరోజు శ్రీధైర్యలక్ష్మీ, నాలుగోరోజు శ్రీసంతానలక్ష్మీ, ఐదోరోజు శ్రీగజలక్ష్మీ, ఆరోరోజు శ్రీవిజయలక్ష్మీ, ఏడో రోజు శ్రీసరస్వతీదేవి, ఎనిమిదో రోజు శ్రీదుర్గాదేవిగా, తొమ్మిదో రోజు శ్రీధనలక్ష్మీ, విజయదశమి రోజున శ్రీసకల సంపద లక్ష్మీదేవీ అవతారంలో భక్తులకు సాక్షాత్కారమిస్తారు.

### ముస్తాబైన దేవాలయాలు

శ్రీస్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం, జమ్మిబండ(పారువేట) స్థలం, గుట్టల బజారులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం, రోటరీనగర్ శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాలతోపాటు మండపాల్లో అమ్మవారికి పూజలు వైభవంగా చేసేందుకు నిర్వాహకులు సిద్ధం చేశారు. అక్టోబరు 12న విజయదశమికి జమ్మి చెట్టుకు పూజ, నరకాసుర వధ కార్యక్రమం జరుగుతుంది. మరుసటి రోజు(13)న అమ్మవారి శోభాయాత్ర సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై కాల్వొడ్డు మున్నేరు వంతెన వద్ద నిమజ్జనం చేస్తారు.



## యువరైతు దుర్మరణం



అంగోత్ గాంధీ

**టేకులపల్లి, న్యూస్‌టుడే:** ఆ కుటుంబం రోజంతా వ్యవసాయ పనుల్లో నిమగ్నమైంది. అంతా కలిసి ఎప్పటిలాగే ఎడ్లబండిపై ఇంటికి తిరుగు పయనమయ్యారు. మార్గంమధ్యలో వాగు ఉద్ధృతికి బండి కొట్టుపోయింది. వరదలో అంతా చెల్లాచెదురయ్యారు. తాను నడుపుతున్న బండి కిందపడి నీళ్లల్లో ఊపిరాడక యువ రైతు మృతిచెందాడు. వెంటనే అప్రమత్తమైన పొరుగు రైతులు మరో ముగ్గురిని కాపాడారు. పొద్దుగూకే సమయంలో పడిన భారీ వర్షంతో ఒక్కసారిగా వాగు ప్రవాహం పెరగడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలో బుధవారం సాయంత్రం జరిగిన సంఘటన వివరాలు. . పి.కొత్తతండాకు చెందిన అంగోత్ గాంధీ (34)కి లక్ష్మీపురం గ్రామ సమీపంలో భూమి ఉంది. ఉదయాన్నే భార్య రజిత, తండ్రి లక్ష్మా, తల్లి జమ్మాతో కలిసి ఎండ్ల బండిపై చేనుకు వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి బయల్దేరాల్సిన సమయంలో సమీప గుట్టలపై భారీ వర్షం కురిసింది. చినుకులు తగ్గగానే కుటుంబమంతా కలిసి తిరిగొస్తున్నారు. రెండు గ్రామాల మధ్యలోనున్న వాగు చప్టా మీదుగా దాటుతుండగా ఒక్కసారిగా వరద పోటు రావడంతో ఎడ్లు బెదిరాయి. దీంతో బండి అదుపుతప్పి ఒక్కసారిగా అయిదు అడుగుల లోతున్న నీళ్లల్లో తలకిందులైంది. అక్కడే పొలాల్లో ఉన్న రైతులు వెంటనే వచ్చి రజిత, లక్ష్మా, జమ్మాలను కాపాడారు. కొద్ది అడుగుల దూరం కొట్టుకుపోయిన బండి చెట్టును తట్టుకుని ఆగింది. చెట్టుకు, బండి మధ్య చిక్కుకున్న గాంధీని వెంటనే బయటకు తీసుకురాగా అప్పటికే అతడు నీళ్లల్లో ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. అప్పటిదాకా తమతో పాటే పనిచేసుకుంటూ ఉన్న ఇంటి పెద్దదిక్కు రెప్పపాటులో విగతజీవిగా మారడంతో భార్య రజిత, తల్లిదండ్రులు గుండెలవిసెలా రోదించారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. టేకులపల్లి ఎస్సై సురేశ్ ఘటనాస్థలిని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత

**ఆళ్లపల్లి, న్యూస్‌టుడే:** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలైన ఘటన బుధవారం చేటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. . లక్ష్మీపురం గ్రామానికి చెందిన కుంజ లక్ష్మయ్య, అంజమ్మ దంపతుల కుమారుడు ప్రవీణ్(19) అదే గ్రామానికి చెందిన ఎట్టి రామస్వామి, కృష్ణవేణి దంపతుల కుమారుడు ప్రణయ్‌తేజ్ (14) ద్విచక్రవాహనంపై అనంతోగులో బంధువుల ఇంటికెళ్లి తిరిగొస్తున్న తరుణంలో తీర్లాపురం-ఆళ్లపల్లి మార్గమధ్యలో మకలకట్ట ఒర్రె సమీపంలోని మలుపు వద్ద ఆర్టీసీ బస్సు, వీరి ద్విచక్ర వాహనం పరస్పరం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ప్రవీణ్ తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. బస్సు టైర్ కిందపడటంతో ప్రణయ్‌తేజ్ తలకు తీవ్రగాయమైంది. ఎడమ కాలు విరిగింది. ఇద్దరు అపస్మారక స్థితికి చేరుకున్నారు. క్షతగాత్రులను 108 వాహనంలో కొత్తగూడెం సర్వజనాసుపత్రికి స్థానికులు తరలించారు. అక్కడ వైద్యమందిస్తుండగా ఇద్దరు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆర్టీసీ డ్రైవర్ ముత్తయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బస్సును ఆళ్లపల్లి ఠాణాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రతీశ్ తెలిపారు.

## లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు

**కూసుమంచి, న్యూస్‌టుడే:** సూర్యాపేట - ఖమ్మం జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున లారీని ఓ ప్రైవేటు బస్సు వెనకనుంచి ఢీకొంది. ఈ క్రమంలో అదుపుతప్పిన బస్సు సర్వీస్ రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఖమ్మం వైపు నుంచి హైదరాబాద్‌కు అతివేగంగా వెళ్తున్న ప్రైవేటు బస్సు హట్యా తండా ప్రాంతంలో ప్రమాదానికి గురైంది. అందులో ఉన్న 24 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వారిని జాతీయ రహదారి రక్షణ విభాగం సిబ్బంది ఇతర బస్సుల్లో తరలించారు.

| చికెన్ ధరలు | వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228. |
|---|---|

## ఖర్చు తగ్గించుకుంటేనే ఆయిల్‌పాంలో లాభాలు: డాక్టర్ ఐవీఎస్ రెడ్డి

**అశ్వారావుపేట, న్యూస్‌టుడే:** సాగు ఖర్చు తగ్గించుకుని ఆయిల్‌పాంలో లాభాలు సాధించాలని వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ ఐవీ శ్రీనివాసరెడ్డి సూచించారు. తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్‌పాం గ్రోయర్స్ సొసైటీ సమావేశాన్ని అశ్వారావుపేట గిరిజన భవన్‌లో తుంబూరి మహేశ్వరరెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రసాయనిక ఎరువులు విచ్చలవిడిగా వాడి సారవంతమైన నేలలను పాడు చేయవద్దని హితవుపలికారు. జీవన, సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం పెరుగుతుందన్నారు. మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పామాయిల్ పరిశ్రమల్లో వచ్చిన ఓఈఆర్‌ను ఏపీ ప్రామాణికంగా తీసుకుంటోందని, మన ఓఈఆర్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లాలో రెండు పామాయిల్ పరిశ్రమలు ఉన్నాయని, రైతుల శ్రేయస్సు దృష్ట్యా ఈ ప్రాంతంలోనే నూనె శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొక్కెరపాటి పుల్లయ్య, జూపల్లి రమేష్ ప్రసంగించారు. తీర్మానం ప్రతిని విడుదల చేశారు. సీతంశెట్టి సత్య, దారా తాతారావు, చిన్నంశెట్టి సత్యనారాయణ, అంకత మహేశ్వరరావు, తుమ్మా రాంబాబు, శీమకుర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తీర్మానం ప్రతిని విడుదల చేస్తున్న రైతుసంఘ నాయకులు

## అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు







ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలు బుధవారం అంబరాన్నంటాయి. పాల్వంచ కేటీపీఎస్ రాధాకృష్ణ ఆలయంలో ఉద్యోగుల కుటుంబాలకు చెందిన మహిళలతో పాటు పరిసర కాలనీల వారు పెద్దఎత్తున తరలివచ్చి బతుకమ్మలాడారు. రామాలయ భజనమందిరం, వేంకటేశ్వరహిల్స్‌కాలనీ, నవభారత్ ప్రాంతాల్లో సందడి నెలకొంది. - పాల్వంచ, న్యూస్‌టుడే

## పక్షి సంచారంపై నిఘావర్గాల ఆరా..!

**చర్ల, న్యూస్‌టుడే:** చర్లలో జీపీఎస్ ట్రాకర్‌తో కూడిన గద్దలాంటి పక్షి సంచారంపై 'ఈనాడు'లో బుధవారం వెలువడిన 'జీపీఎస్ ట్రాకర్‌తో.. చర్లలో గద్ద సంచారం..!' కథనం ప్రచురితమైన నేపథ్యంలో నిఘా వర్గాలు ఆరా తీశాయి. జీపీఎస్ ట్రాకర్, కెమెరాలతో ఉన్న పక్షి ఇక్కడి నాయకకాలనీలో గుట్ట ప్రాంతంలోని ఏకలవ్య విద్యాలయం సమీపంలోకి వచ్చి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. దీనిపై జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు, నిఘా వర్గాలు ఆరా తీయడంతో సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి గద్ద సంచారంపై స్థానికుల నుంచి సమాచారాన్ని బుధవారం తెలుసుకున్నారు. ఈ పక్షి మధ్యప్రదేశ్‌లోని పన్నా టైగర్ రిజర్వు ఫారెస్ట్‌కు చెందినదిగా భావిస్తున్నారు. అక్కడ సుమారు రెండు డజన్ల ఇలాంటి పక్షులను శాస్త్రీయంగా పర్యవేక్షించడానికి రెండేళ్ల క్రితం జీపీఎస్‌తో ట్యాగ్ చేసినట్లు పేర్కొంటున్నారు. ఇందులో ఒక పక్షి ఇటు వచ్చినట్లు భావిస్తున్నారు. మళ్లీ ఈ పక్షి సంచరిస్తే సమాచారం ఇవ్వాలని పోలీసు అధికారులు సూచించారు.

## డెంగీతో వృద్ధుడి మృతి

**తల్లాడ, న్యూస్‌టుడే:** మల్లవరం గ్రామానికి చెందిన ఓ ప్రైవేట్ సర్వేయర్ (66) డెంగీతో బాధపడుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. గత నెల 16న డెంగీ బారిన పడటంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. సుదీర్ఘ కాలం సర్వేయర్‌గా పనిచేసిన ఆయనకు గుర్తింపు ఉంది.

## నాటి సీఎం కప్ విజేతలకు ఆహ్వానం

**ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే:** గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పోటీలు నిర్వహించింది. నాటి విజేతలను ఈనెల 3న హైదరాబాద్ ఎల్.బి. స్టేడియానికి రావాలని ఆహ్వానాలు అందాయి. జాబితా జిల్లా యువజన క్రీడల శాఖకు అందంగా ఇక్కడి అధికారులు సమాచారం అందజేశారు. గత ఏడాది పోటీలు నిర్వహించినప్పటికీ విజేతలకు ప్రకటించిన నగదు బహుమతులు అందలేదని, వాటిని అందజేసేందుకు విజేతలను ఆహ్వానించినట్టు సమాచారం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నాటి విజేతలు 55 మంది ఉన్నారు.

## మరో మృతదేహం లభ్యం

**ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే:** ఖమ్మం దానవాయిగూడెం వద్ద మంగళవారం తెల్లవారుజామున సాగర్ కాల్వలో పడి ముగ్గురు గల్లంతైన విషయం విదితమే. ఒకరి మృతదేహం అదే రోజు లభ్యమవ్వగా.. బుధవారం మరొకరి మృతదేహం కనిపించింది. వి.వెంకటాయపాలెం సమీపంలోని సాగర్ కాల్వపై ఉన్న లాకుల వద్ద చల్లా రమేశ్(38) మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అన్నం సేవా సంస్థకు సమాచారం ఇవ్వడంతో బాధ్యులు వెళ్లి మృతదేహాన్ని ఉదయం బయటకు తీసుకువచ్చారు. అనంతరం ఖమ్మం సర్వజనాసుపత్రి మార్చురీకి తరలించారు. మంగళవారం సాయంత్రం భరత్ మృతదేహం లభ్యమైంది. బుధవారం చల్లా రమేశ్, భరత్ మృతదేహాలకు పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు. వారు ప్రభుత్వ వాహనంలో మణుగూరు తీసుకువెళ్లారు. గల్లంతైన మరో యువకుడు ప్రసాద్ ఆచూకీ లభ్యం కావాల్సి ఉంది.

## హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య



పులిసాని మహేశ్‌రెడ్డి

**అశ్వాపురం, న్యూస్‌టుడే:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మొండికుంటకు చెందిన పులిసాని మహేశ్‌రెడ్డి(34) హైదరాబాద్‌లో బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నార్సింగ్ పోలీసుస్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటుచేసుకుంది. మహేశ్‌రెడ్డి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, నాలుగేళ్ల కుమార్తె, ఏడాది కుమారుడు ఉన్నారు. ఆదివారం కుమారుడి తొలి పుట్టిన రోజు వేడుకలను మొండికుంటలో తన తల్లిదండ్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం సోమవారం ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. వెళ్లిన రెండో రోజే అతని మృతదేహం గ్రామానికి తిరిగి రావడంతో గ్రామంలో విషాదం అలముకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలోనే మహేశ్‌రెడ్డి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం.

# కాంట్రాక్టు కొలువులైనా దక్కేనా..?

ప్రభుత్వం ఆదేశించినా మొదలుకాని ధ్రువపత్రాల పరిశీలన

**భద్రాచలం, న్యూస్‌టుడే:** ఉమ్మడి ఏపీలో 2008లో నిర్వహించిన కామన్ డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు ఇప్పటికీ మోక్షం లభించలేదు. అప్పట్లో నష్టపోయిన వారికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టు విధానంలో కొలువులు ఇచ్చేందుకు నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై భద్రాచలం మన్యంలో ఇంకా అయోమయం వీడడం లేదు. ఖమ్మం మైదాన ప్రాంతంలో ధ్రువపత్రాల పరిశీలన చేపడుతున్నారు. ఎస్టీ అభ్యర్థులను ఐటీడీఏకు వదిలేశారు. దీంతో ఆ అభ్యర్థులు అటు విద్యాశాఖ కార్యాలయానికి, ఇటు ఐటీడీఏకు తిరుగుతూ గోడు వెళ్లబోసుకుంటున్నారు.

**అప్పట్లో ఏం జరిగిందంటే...** 2008 డీఎస్సీ నియామక ప్రక్రియలో ఆఖరి నిమిషంలో అనూహ్యంగా 30 శాతం సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులను డీఈడీ పూర్తి చేసిన వారికి ప్రత్యేకంగా ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో మార్కుల పరంగా ముందున్నప్పటికీ దాదాపు 2367 మంది బీఈడీ అభ్యర్థులు నష్టపోయారు. దీంతో అప్పటి నుంచి వీరు న్యాయ పోరాటం చేస్తున్నారు. ఈ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోర్టులు తీర్పునిచ్చాయి. ఎన్నికల హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ పద్ధతిలో ఎస్జీటీలుగా నియమించాలని ఆదేశించింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలలో 330 మందికి కాంట్రాక్ట్ పద్ధతిలో ఉపాధ్యాయ పోస్టులు రానుండగా.. 67 మంది గిరిజన అభ్యర్థులు ఉన్నారు. మిగతావారి ధ్రువపత్రాలను ఖమ్మంలో పరిశీలిస్తుండగా, గిరిజన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఎవ్వరు పరిశీలించాలన్నది తేల్చకుండా నాన్చుతున్నారు. 67 మందిలో 20 మంది వేర్వేరు వృత్తుల్లో, ఉపాధి అవకాశాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. మిగతావారు వారు గిరిజన సంక్షేమశాఖ డీడీ మణెమ్మను కలిసి తమ పరిస్థితిని వివరించారు. ఆమె పీఓ రాహుల్, సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. డీఈఓ పరిశీలన చేయని పక్షంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐటీడీఏలోనే పరిశీలన చేసి కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకుంటామని డీడీ తెలిపారు.



డీఎస్సీ అభ్యర్థుల దరఖాస్తును పరిశీలిస్తున్న డీడీ మణెమ్మ

### నేడు మైదాన ప్రాంతంలో..

**ఖమ్మం సంక్షేమవిభాగం, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం.. ఐటీడీఏ ప్రాంత డీఎస్సీ 2008 అభ్యర్థులు 67 మందికి ఈనెల 3న ఖమ్మం ఆర్‌టీఏ కార్యాలయం వెనుక ఉన్న గిరిజన భవన్‌లో ధ్రువపత్రాల పరిశీలన ఉదయం 9:30 గంటలకు చేపట్టనున్నారు. ఈ మేరకు గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఎన్.విజయలక్ష్మీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒప్పంద పద్ధతిలో నియామకం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు ఒక సెట్ గెజిటెడ్ సంతకంతో ఉన్న నకలు పత్రాలను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

# భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

## ప్రజా భాగస్వామ్యంతోనే పనుల్లో పురోగతి: డీఆర్డీఏ పీడీ

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: ప్రజల భాగస్వామ్యంతోనే ఉపాధి పనుల్లో పురోగతి ఉంటుందని డీఆర్డీఏ పీడీ నక్షత్రల రవికుమార్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని ప్రతి పంచాయతీలో గ్రామసభలు నిర్వహించారు. పేరాయిగూడెంలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రవికుమార్ మాట్లాడుతూ ఉపాధి పనుల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు.

దమ్మపేట: ఉపాధిహామీ పనుల గుర్తింపు గ్రామ సభలు మండలంలోని అన్ని పంచాయతీల్లో బుధవారం నిర్వహించారు. దమ్మపేటలో నిర్వహించిన సభలో అడిషనల్ డీఆర్డీవో ఎస్.రవి ప్రసంగించారు. చంద్రుగొండ: మండలంలోని అన్ని పంచాయతీల్లో బుధవారం ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహించారు. మండలంలో 3.33 లక్షల పనిదినాలకు కావాల్సిన పనులను గుర్తించాలన్నారు.

## గోదావరి నది వద్ద భక్తుల పూజలు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం గోదావరి నది స్నాన ఘట్టాల వద్ద భక్తులు పూజారులతో ప్రత్యేక పూజలు బుధవారం జరిపించారు. అమావాస్య కావడంతో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక నదిలో స్నానమాచరించి పెద్దలకు, పితృదేవతలకు పిండ ప్రదాన పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## వైద్య విద్యార్థికి సన్మానం

గుండాల, న్యూస్‌టుడే: పాలగూడెం గ్రామానికి చెందిన వైద్యవిద్యార్థి వజ్జ వీరకుమారిని బుధవారం వాసవిక్లబ్ (గ్రీన్‌పిల్స్) మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గుండాలలో సన్మానించారు. పేదరికాన్ని జయించి క్రమశిక్షణ, పట్టుదలతో చదివి వైద్యవిద్యార్థిగా సీటుపొందడం హర్షణీయమన్నారు.



వాసవీక్లబ్ ఆధ్వర్యంలో వీరకుమారిని సన్మానిస్తూ..

## ఏజెన్సీలో సేవలకు ట్రస్టు ఏర్పాటు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: ఏజెన్సీలో ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసేందుకు వాజీరామ్ ట్రస్టు ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు బానోత్ వాజీ వెల్లడించారు. స్థానికంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అక్టోబరు 2న గాంధీ జయంతి రోజున ట్రస్టు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. సేవాభావంతో సేవలకు చేయూత అందించనున్నట్లు వివరించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033

**సమస్య:** భద్రాచలం ఐటీడీఏకు వెళ్లే మార్గంలో క్రీడా మైదానం సమీపంలో రహదారిపై పెద్ద గుంత ఏర్పడింది. వాహన చోదకులు తరచూ ఇక్కడ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ గుంతను పూడ్చించాలి. - **రమేశ్, స్థానికుడు**

**సమాధానం:** పరిశీలించి వీలైనంత త్వరగా మరమ్మతులు చేయిస్తాం. - **శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ ఈఓ**

భద్రాచలం, న్యూస్‌టుడే



భద్రాచలం పట్టణంలోని నిత్యం రద్దీగా ఉండే బస్టాండు వెనుక వైపు వీధిలో ట్రాఫిక్ సమస్యలను పోలీసులు పట్టించుకోవాలి. ఇక్కడ టాటా మ్యాజిక్‌లు రోడ్డుకు ఇరువైపులా పెట్టడంతో అక్కడి ఆసుపత్రులకు వచ్చే అంబులెన్సులు, ఆటోలు రావాలన్నా ఇబ్బంది ఏర్పడుతోంది. - **రాజేశ్, భద్రాచలం**

✔ ఆటోలు, టాటా మ్యాజిక్‌లు అక్కడ నిలపకుండా తగు చర్యలు చేపడతాం. - **మధు ప్రసాద్, భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై**

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే

నర్సాపురం గ్రామ పంచాయతీలో పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు.

✔ పరిశీలించి వీధి దీపాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాము. - **యాకూబ్, పంచాయతీ కార్యదర్శి**

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే

# వ్యవసాయ క్షేత్రంలో.. విరబూసిన కుసుమాలు

## విద్యార్థులుగా వెళ్లి అధికారులుగా..!

అశ్వారావుపేట, న్యూస్‌టుడే

చదువులే, ర్యాంకులే, క్రీడల్లో, పీజీ, పీహెచ్‌డీ సీట్ల సాధనలో ముందు వరుసలో ఉండే అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల రాష్ట్రంలో జరిగిన వ్యవసాయ అధికారుల ఎంపికలోనూ ప్రత్యేకత చాటుకుంది. రాష్ట్రం మొత్తం 120మంది ఏఓలుగా ఎంపిక కాగా అందులో 22మంది ఈ కళాశాల పూర్వ విద్యార్థులే ఉన్నారు. కొద్ది రోజుల్లో వీరు నియామక ఉత్తర్వులు అందుకోనున్నారు. గత ఏడాది మేలో ఏఓ నియామక పరీక్షలు నిర్వహించగా, తుది ఎంపిక అనంతరం ఇటీవలే ఫలితాలు ప్రకటించారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఏఓలుగా ఎంపిక కావడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.



అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల

### రైతులకు దగ్గరగా ఉండి..



మాది పేద వ్యవసాయ కుటుంబం. చిన్నప్పటి నుంచి వ్యవసాయంపై మక్కువతోనే ఏజీబీఎస్సీ పూర్తి చేశా. చేరినరోజే వ్యవసాయ అధికారి కావాలని నిర్ణయించుకున్నా. అనుకున్న లక్ష్యం సాధించాను. **- నూనె యమునదుర్గ**

### సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు..



పీజీ అయినా, పీహెచ్‌డీ చేసినా రైతులకు దగ్గరగా ఉండేది మాత్రం వ్యవసాయ అధికారి. ప్రస్తుతం దిల్లీలో సీడ్ టెక్నాలజీలో పీహెచ్‌డీ మూడో సంవత్సరం చేస్తున్నాను. సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందుబాటులో ఉంచేందుకు ఏఓగా కృషి చేస్తా. – బి.మధుసూధన్

### శాస్త్రవేత్తగా రాణించాలని



వ్యవసాయ శాస్త్రవేత్తగా రాణించాలని జెనిటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్‌లో పీహెచ్‌డీ చేస్తున్నాను. వ్యవసాయ అధికారిగా చేస్తూనే శాస్త్రవేత్తగా వెళ్లనున్నాను. అందుకవసరమైన కసరత్తు చేయనున్నాను. – కనకం సాయి దీక్షిత్

### మమేకం కావొచ్చు



ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాను. ఏఓగా ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ఎమ్మెస్సీ మధ్యలోనే ఆగింది. మాది వ్యవసాయ కుటుంబం కావడంతో రైతుల కష్టాలు నాకు తెలుసు. ఎన్నిరకాల పంటలుంటాయో అంత మంది రైతులను కలుసుకునే వీలు ఏఓకే ఉంటుంది. – కర్రోళ్ల గిరిరాజ్

### అన్నదాతలకు సేవలు అందించేందుకు..



వ్యవసాయ అధికారికి ముందుగా గుర్తుకు వచ్చేది రైతులు. పంటల్లో మెలకువలు, అధిక దిగుబడి, విత్తనాల ఎంపిక, ధరలు, మార్కెట్ అన్ని రైతులకు అవగాహన కల్పించే అవకాశం ఉంటుందనే ఏఓగా వెళ్లాలని నిర్ణయించుకున్నా. – బాణోతు నాగరాజు

### శాస్త్రవేత్త కావాలని



వ్యవసాయ శాస్త్రవేత్త అంటే ఇష్టం. ప్రస్తుతం ఎమ్మెస్సీ పూర్తయింది. ఏఓగా ఎంపికైనా వ్యవసాయ శాస్త్రవేత్త కావాలనేదే తన లక్ష్యం. ప్రజల మధ్య ఉండి సేవచేసే అవకాశం ఏఓకు ఉంటుంది. అందుకే ఈ రంగాన్ని ఎంచుకున్నాను. - జి.అనూష

## శిథిలావస్థలో భవనం.. బిక్కుబిక్కుమంటూ వైద్యం



దమ్మపేట మండలంలోని మల్కారం గ్రామీణ పశుగణన కేంద్రం శిథిలావస్థకు చేరి భవనం స్లాబు కురుస్తోంది. గోడలూ బీటలు వారాయి. ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి. ఈ కేంద్రంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌తోపాటు ఇద్దరు సిబ్బంది పనిచేస్తున్నారు. ఈ కేంద్రం పరిధిలో పలు గ్రామాల మూగజీవాలకు వైద్యసేవలు అందుతున్నాయి. పశుసంవర్ధకశాఖ అశ్వారావుపేట సహాయ సంచాలకుడు ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రం దుస్థితి తమ దృష్టికి వచ్చిందన్నారు. నూతన భవనం నిర్మాణానికి ఉన్నతాధికారులకు నివేదికలు పంపామన్నారు. – దమ్మపేట, న్యూస్‌టుడే

## నిర్లక్ష్యం వద్దు.. రక్షణే ముద్దు



వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలం విచ్చేసే భక్తులకు ఆటవిడుపు కోసం గోదావరి నదిలో విహరించేందుకు చేసే బోటు ప్రయాణంలో నిర్వహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. బోటులో ప్రయాణికులు లైఫ్ జాకెట్లు లేకుండా నదిలో బుధవారం షికారు చేస్తున్నారు. నిర్లక్ష్యం వద్దు రక్షణే ముద్దు అని అధికారులు నిర్వాహకులను హెచ్చరించాల్సి అవసరం ఎంతైనా ఉంది. బోటు షికారు వేలం పాట దక్కించుకున్న వారికి నిబంధనలు తప్పక పాటించేలా ఆదేశాలు జారీ చేయాల్సి ఉంది. ఈ పరిస్థితిని పంచాయతీ ఈఓ సీహెచ్ శ్రీనివాసరావు దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా నిబంధనలు గతంలో చెప్పామని, జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. – భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే

## కుటుంబ డిజిటల్ కార్డుల సర్వేకు ఏర్పాట్లు

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరులో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు తహసీల్దారు రాఘవ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి కుటుంబాన్ని సర్వే చేసి యూనిక్ నంబర్ ఇచ్చేందుకు వీలుగా గురువారం నుంచి ఈనెల 7 వరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఫ్యామిలీ డిజిటల్ సర్వే సాగుతుందన్నారు.

**కలెక్టర్‌కు వినతి: అశ్వాపురం:** పట్టణంలో నిరుపయోగంగా బస్‌స్టేషన్‌ను వినియోగంలోకి తేవాలని, ప్రజా మరుగుదొడ్లను నిర్మించాలని, ఎస్సీ కాలనీలోని శ్మశాన వాటికకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ భారాస యువజన విభాగం అధ్యక్షుడు గద్దల రామకృష్ణ అశ్వాపురం వచ్చిన జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ వినతిపత్రాలను సమర్పించారు.

## రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవరు దుర్మరణం

చంద్రుగొండ, న్యూస్‌టుడే: చంద్రుగొండ మండలం అయ్యన్నపాలెం మలుపు వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యాదాద్రి భువనగిరి మండలం అడ్డగోడూరుకు చెందిన లారీ డ్రైవర్ ఏనుగు నవీన్‌కుమార్(32) మృతి చెందాడు. ఎస్‌ఐ గంజి స్వప్న కథనం ప్రకారం.. ఏపీలోని రేణిగుంట నుంచి మిషన్ భగీరథ పైపుల లోడుతో వస్తున్న లారీ చంద్రుగొండ మండలం అయ్యన్నపాలెం ఒడ్డు వద్ద ఉన్న మలుపు వద్ద బోల్తా పడింది. దాని డ్రైవరు నవీన్‌కుమార్ అక్కడిక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం. . దమ్మపేటకు చెందిన పస్తం రాంప్రసాద్(32) ద్విచక్ర వాహనంపై మంగళవారం తెల్లవారుజామున అశ్వారావుపేట వెళుతూ ఆగిఉన్న లారీని ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని కుటుంబికులు ఖమ్మం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఇసుక తరలిస్తున్న లారీలు పట్టివేత

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అశ్వారావుపేట పోలీసులు బుధవారం రెండు ఇసుక లారీలను పట్టుకున్నారు. ఎస్సై యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం వింజరం నుంచి ఏపీలోని జంగారెడ్డిగూడేనికి రెండు లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. వాటిని ఆపి తనిఖీ చేయగా అధిక లోడుతోపాటు తెలంగాణ రహదారులపై రావాణా అనుమతులు లేనట్లు గుర్తించి వాటిని పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

భద్రాచలం: భద్రాచలం పట్టణంలోకి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులపై కేసు నమోదు చేశారు.

## పండగపూట విషాదం..

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరుకు చెందిన ముగ్గురు స్నేహితులు మంగళవారం ఖమ్మం వెళ్లి కాల్వలో గల్లంతైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గల్లంతైన ముగ్గురిలో బండారు భరత్(30), చల్లా రమేశ్(38) మృతదేహాలు లభ్యమవడంతో కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తీసుకువచ్చి బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. దసరా పండుగను ఘనంగా జరుపుకుందామనుకున్న ఆ కుటుంబాల్లో వీరిద్దరి మరణం పెను విషాదాన్ని నింపింది. అంత్యక్రియలకు గ్రామస్థులు భారీగా హాజరయ్యారు.

## భద్రాచలంలో స్వచ్ఛతాహీ సేవ ర్యాలీ



స్వచ్ఛతాహీ సేవ ర్యాలీలో పాల్గొన్న ఈఓ శ్రీనివాసరావు, వావ్ సంస్థ ప్రతినిధులు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛతాహీ సేవ ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం నుంచి ఈఓ సీహెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్మికులు, సిబ్బంది ఐటీసీ వావ్ సంస్థ, ఈశ్రీ ఫౌండేషన్ సభ్యులు పట్టణ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో పరిశుభ్రత, తడి, పొడి చెత్త వేరు చేయడం, ప్లాస్టిక్ వాడకం నివారణపై అవగాహన కల్పించారు. చెత్త సేకరణ సిబ్బందికి సహకరించాలన్నారు. రమ్య, సౌజన్య, పంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

**అశ్వారావుపేట, న్యూస్‌టుడే:** అశ్వారావుపేటలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక పాత సీహెచ్‌సీ ఆవరణను శుభ్రం చేశారు. పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామస్థుల ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రత్యేక అధికారి ప్రదీప్‌కుమార్ సారథ్యంలో బుధవారం ఆసుపత్రి ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించారు.

**అన్నపురెడ్డిపల్లి:** మొక్కలతోనే మానవ మనుగడ అని ఐసీడీఎస్ సీడీపీవో డి.సలోమి పేర్కొన్నారు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.

### వేతన బకాయిలు చెల్లించాలి

ములకలపల్లి, న్యూస్‌టుడే: పంచాయతీ కార్మికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల కార్యదర్శి గంటా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అయిదు నెలలుగా ఉన్న వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ ములకలపల్లి పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. శ్రీను, రమేష్, సతీష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### విజయగాంధీ జన్మదిన వేడుక

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బూర్గంపాడు జడ్పీటీసీ మాజీ సభ్యుడు భట్టా విజయగాంధీ జన్మదిన వేడుకను మణుగూరులోని అంబేద్కర్ కూడలి వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ యువత ఆయనకు ఘనంగా స్వాగతం పలికి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

### జూద స్థావరంపై దాడి

దమ్మపేట, న్యూస్‌టుడే: మండలంలోని నాచారం సమీపంలో నిర్వహిస్తున్న జూదస్థావరంపై ఎస్సై సాయికిషోర్‌రెడ్డి బుధవారం దాడి చేశారు. అయిదుగురిని అదుపులోకి తీసుకుని రూ.33వేల నగదు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు.



భద్రాచలం పట్టణం: క్యాంపు కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే తెల్లం



మణుగూరు సాంస్కృతికం: ప్రజాభవన్‌లో నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



అశ్వాపురంలో కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న పారిశుద్ధ్య కార్మికులు



దమ్మపేట: గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఆర్యవైశ్య, భాజపా నాయకులు

## అహింసా మార్గమే.. మహాత్ముని ఆయుధం



చర్లలో ర్యాలీగా సీఆర్పీఎఫ్ 141 జవాన్లు

భద్రాచలం పట్టణం, చర్ల, దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో గాంధీజీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పలువురు అధికారులు మాట్లాడుతూ గాంధీ మహాత్ముని ఆయుధం అహింసా మార్గమని వివరించారు. ఆయన సిద్ధాంతాలు ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. స్థానిక ఫస్ట్‌క్లాస్ జుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో న్యాయమూర్తి ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గాంధీజీ జయంతి నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పాల్గొని నివాళులర్పించారు. పలు సంఘాల ఆధ్వర్యంలో గాంధీజీ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. 141 బెటాలియన్ సీఆర్పీఎఫ్ కమాండెంట్ రితేష్ ఆధ్వర్యంలో సరోజిని వృద్ధుల ఆశ్రమాన్ని శుభ్రపరిచారు. చర్ల, దుమ్ముగూడెంలోనూ కార్యక్రమాలు సాగాయి.

**అశ్వాపురం, న్యూస్‌టుడే** : జాతిపిత మహాత్మాగాంధీ జీవితమే మార్గదర్శకమని జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అన్నారు బుధవారం మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని అశ్వాపురం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆవరణలో నిర్వహించిన జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. అహింసే ఆయుధంగా దేశానికి స్వాతంత్ర్యం సాధించిన జాతిపిత అడుగుజాడల్లో నేటి యువత నడవాలని ఆకాంక్షించారు. రైతులు స్వయం సమృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు. వృద్ధులను, పారిశుద్ధ్య కార్మికులను కలెక్టర్ సన్మానించారు. డీపీఓ చంద్రమౌళి, డీఎల్‌పీఓ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



మణుగూరు సాంస్కృతికం: ఏరియా ఆసుపత్రిలో మహాత్ముడికి నివాళి అర్పిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, ఆసుపత్రి సిబ్బంది

★ పినపాక, మణుగూరు సాంస్కృతికం: పినపాక, మణుగూరులో పలు ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో బుధవారం జాతిపిత జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. మణుగూరు ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ రవీంద్రా రెడ్డి, నివాళులు అర్పించారు.

**న్యూస్‌టుడే బృందం:** గాంధీ జయంతి వేడుకలను అశ్వారావుపేట, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, చంద్రుగొండ, కరకగూడెం, గుండాల, బూర్గంపాడు, మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీ కార్యాలయాల్లో మంగళవారం నిర్వహించారు.

## ఆరోగ్యకర వాతావరణాన్ని కల్పించుకోవాలి: జీఎం

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: పరిసరాలను ప్రతిరోజూ శుభ్రం చేసుకుంటూ ఆరోగ్యకర వాతావరణాన్ని కల్పించుకోవాలని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ సూచించారు. మణుగూరులోని పీకేఓసీ ఏజెంటు కార్యాలయం వద్ద బుధవారం స్పెషల్ క్యాంపెయిన్ 4.0 రెండవ దశను ప్రారంభించారు. జీఎంతో పాటు పలువురు అధికారులు పరిసరాల చెత్తను తొలగించి శుభ్రపర్చారు. అధికారులు వెంకటేశ్వర్లు, లక్ష్మీపతి, వీరభద్రరావు, రమేష్, వెంకట్రావ్, రాంబాబు పాల్గొన్నారు.

## గ్రీన్ అంబాసిడర్లను విధుల్లోకి తీసుకోవాలి

ములకలపల్లి, న్యూస్‌టుడే: పంచాయతీలలో అదనపు సిబ్బందిగా పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి జబ్బార్ డిమాండ్ చేశారు. అదనపు సిబ్బందితో కలిసి జగన్నాథపురం పంచాయతీ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఏడేళ్లుగా డంపింగ్ యార్డుల్లో తడి, పొడి చెత్తను వేరుచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లను విధుల్లోకి రావద్దంటూ మండల అధికారులు సూచించడం సరికాదన్నారు.

## మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికుల ఆందోళన




అశ్వాపురం, న్యూస్‌టుడే: ఐక్యతతోనే సమస్యలు పరిష్కారమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేశ్ అన్నారు. మిట్టగూడెంలోని రథం గుట్ట వద్ద మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులతో బుధవారం అశ్వాపురంలోని సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. గౌతమీనగర్ ప్రధాన ద్వారం వరకు ప్రదర్శన నిర్వహించారు. గద్దల శ్రీనివాసరావు, సతీశ్, నాగరాజు, లక్ష్మణ్, రాముడు, తదితరులు పాల్గొన్నారు. 30 రోజులుగా నిరసన తెలుపుతున్నా పట్టించుకోకపోవడంతో ఈ నెల 5నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు పేర్కొన్నారు.

### బెదిరింపుల ఘటనపై కేసు

ములకలపల్లి, న్యూస్‌టుడే: ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని బెదిరింపులకు పాల్పడిన వారిపై ములకలపల్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం రంగాపురం గ్రామానికి చెందిన గడ్డం ప్రశాంత్‌పై దాడి జరగగా నిందితులపై సెప్టెంబరులో కేసు పెట్టారు. ఈ కేసును ఉపసంహరించుకోవాలని పది మంది బెదిరింపులకు పాల్పడుతున్నారని ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



భద్రాచలం అశోక్‌నగర్ కాలనీలో బతుకమ్మల సంబరం



మణుగూరు సాంస్కృతికం: పూజారి నగర్‌లో..



దుమ్ముగూడెం: కె.లక్ష్మీపురంలో..

## బతుకమ్మ సంబురాల సందడి

భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: బతుకమ్మ సంబరాలు భద్రాచలం నియోజకవర్గంలో బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు పెద్ద సంఖ్యలో గద్దెల ప్రాంతాలకు చేరుకున్న మహిళలు గౌరమ్మకు సంప్రదాయ పూజలు నిర్వహించారు. ఎంగిలి పూల బతుకమ్మలతో ఆడి పాడారు. భద్రాచలంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపి కొద్దిసేపు ఆడి సరదాగా గడిపారు. భద్రాచలం, చర్ల మండలాల్లో మహిళలు యువతులు బంతి, తంగేడు వంటి పూలతో బతుకమ్మలను పేర్చి పాటలతో సందడి చేశారు. దుమ్ముగూడెం ముండలంలో గోదావరివద్ద బతుకమ్మకు పూజలుచేసి మొక్కులు చెల్లించి నిమజ్జనం చేశారు.

అశ్వారావుపేట, చంద్రుగొండ, న్యూస్‌టుడే: అశ్వారావుపేట రామాలయం, షిర్డి సాయిబాబా మందిరం, నాయిబ్రాహ్మణ బజారు, కన్యకాపరమేశ్వరీ ఆలయం, మద్దిరావమ్మ గుడి, వాల్మీకి ఆలయాలవద్దకు బతుకమ్మలు తెచ్చి లయబద్ధంగా ఆట పాటలతో సందడి చేశారు. మహిళలు, చిన్నారులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. చంద్రుగొండ మండలంలోని అన్ని గ్రామాల్లో బతుకమ్మ సంబురాలు సాగాయి.

★ అశ్వాపురం, ఆళ్లపల్లి న్యూస్‌టుడే: ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు మండలాల్లోని గ్రామాల్లో సందడిగా నిర్వహించారు. ఒక్కేసి.. పువ్వేసి.. చందమామ.. ఒక్క జాములాయే చందమామ అంటూ మహిళలు, యువతులు బతుకమ్మ పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం సమీప వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. మహిళలకు ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలు, చౌరస్తాలు బతుకమ్మ సంబురాలతో సందడిగా మారాయి. గుమ్మడి, గునుగు, తంగేడు తదితర పూలు సేకరించి మహిళలు, యువతులు ఆనందంగా బతుకమ్మను పేర్చి చుట్టూ చేరి పాటలతో వేడుకను ఘనంగా నిర్వహించారు.



భద్రాచలం శాంతినగర్ కాలనీలో ఎమ్మెల్యే తెల్లం..



అశ్వారావుపేట రామాలయం వద్ద..



అశ్వారావుపేట: బతుకమ్మతో తరలివస్తున్న మహిళ..

## అల్లుకున్న నిర్లక్ష్యం..!



కొత్తూరు రోడ్డు సమీపంలో జలలబింత వద్ద విద్యుత్తు స్తంభానికి తీగజాతి మొక్కలు అల్లుకుపోయాయి. పశువులు దానికి తాకితే విద్యుత్తు ప్రమాదానికి గురయ్యే అవకాశముంది. అలాగే తీగలు మరింత పైకి పాకితే విద్యుత్తు సరఫరాకు ఆటంకం ఏర్పడనుంది. ఈ అంశంపై ఏఈ సతీశ్‌కుమార్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. – జూలూరుపాడు, న్యూస్‌టుడే

# కొత్తగూడెం

•కొత్తగూడెం •ఇల్లెందు

## వేడుకల ఏర్పాట్లకు పరిశీలన

ఇల్లెందు గ్రామీణం: సింగరేణిలో ఈ నెల 10న జరిగే 'బతుకమ్మ ఆట పాట' వేడుకల ఏర్పాట్లకు సింగరేణి హైస్కూల్ మైదానాన్ని ఏరియా జీఎం జాన్ ఆనంద్ బుధవారం పరిశీలించారు. నిమజ్జనం, లైటింగ్ వసతుల కల్పనపై అధికారులతో మాట్లాడారు. ఇల్లెందు ఏరియాలో జరగనున్న కంపెనీ బాస్కెట్‌బాల్ పోటీల ఏర్పాట్లపై సూచన చేశారు. డీజీఎం (పర్సనల్) మోహన్‌రావు, రవికుమార్ (సివిల్), అధికారులు పాల్గొన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM)
కొత్తగూడెం: 8008573723
పాల్వంచ: 9550076766
ఇల్లెందు: 9154846689

సమస్య: కిరోసిన్ బంకు నుంచి స్టూగోల్గోదాం వెళ్లే దారిలో విద్యుద్దీపాలు వెలగడం లేదు. మత్తు బాబుల బెడద ఎక్కువైంది. – పాఠకుడు
సమాధానం: వీధిదీపాల సమస్య పరిష్కరిస్తాం. – శేషు, కమిషనర్
– కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

## ఫుట్‌బాల్ జట్టుకు విద్యార్థి ఎంపిక

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న చంద్రశేఖర్ కేయూ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ చిన్నప్పయ్య బుధవారం తెలిపారు.

# పెద్దమ్మ దర్శనం.. నవ్యరూపం!

అమ్మలగన్న అమ్మ.. కోర్కెలు తీర్చే కల్పవల్లి.. పాల్వంచ పెద్దమ్మతల్లి (కనకదుర్గ) విజయ దశమి సందర్భంగా శరన్నవరాత్రుల్లో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. మహోత్సవాలకు దేవాదాయ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.. నేటి నుంచి అమ్మవారి ప్రత్యేక అలంకరణలు ప్రారంభంకానున్నాయి. దుర్గమ్మ దర్శనానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరానున్నారు. – పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే

### 3వ తేదీ బాలా త్రిపురసుందరీ దేవి



గురువారం ఆశ్వయుజ శుద్ధపాడ్యమి రోజున అమ్మవారిని శ్రీబాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరిస్తారు. బాలాదేవి ఎంతో మహిమాన్వితమైనదని అర్చకులు ప్రవచిస్తారు. మహాత్రిపుర సుందరీ దేవి నిత్యం కొలువుండే పవిత్రమైన శ్రీచక్రంలో తొలి ఆవరణ దేవత ఈ అమ్మవారిదే. ఆమె అనుగ్రహం పొందితే మహా త్రిపుర సుందరీదేవి అనుగ్రహాన్ని పొందగలం అనేది భక్తుల నమ్మకం.

### 4న గాయత్రి దేవి



ఆశ్వయుజ శుద్ధ విదియ రోజు శుక్రవారం నాడు గాయత్రీదేవిగా అమ్మవారు దర్శనమిస్తారు. సకల మంత్రాలకు మూల శక్తి, వేదమాత గాయత్రీదేవి. సమస్త దేవతా మంత్రాలకు గాయత్రీదేవి మంత్రంతో అనుబంధం ఉంది. అందుకే, సమస్త దేవతలందరికీ నివేదన చేయబోయే నైవేద్యాన్ని ముందుగా గాయత్రి మంత్రంతోనే సంప్రోక్షణ చేస్తారు.

### 5న అన్నపూర్ణాదేవి



ఆశ్వయుజ శుద్ధ తదియ (శనివారం) రోజున అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిస్తారు. ఆమె.. సకల జీవరాశులకు ఆహారాన్ని అందించే దేవత. అన్నాన్ని పరబ్రహ్మ స్వరూపంతో పోల్చుతాం. నిత్యాన్నదానేశ్వరి అలంకారంలో ఉన్న దుర్గమ్మను దర్శిస్తే అంతా మంచి జరుగుతుందని భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు.

### 6న లలితా త్రిపురసుందరీదేవి



ఆశ్వయుజ శుద్ధ చవితి (ఆదివారం) నాడు లలితా త్రిపుర సుందరి దేవి అలంకారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారు. లక్ష్మీదేవి, సరస్వతి దేవి ఇరువైపులా వింజామరలతో సేవిస్తుండగా.. చిక్కు అమ్మవారు చిరునవ్వుతో చెరకు గడను చేతపట్టుకొని, శివుని వక్షస్థలంపై కూర్చొని చిరుమందహాసంతో దర్శనమిస్తుందీ తల్లి. త్రిమూర్తులకన్నా పూర్వం నుంచే కొలువందుకుంటూ.. భక్తులను అనుగ్రహిస్తోంది.

### 7న



అయిదో రోజు ఆశ్వయుజ శుద్ధ పంచమి (సోమవారం) నాడు మంగళ గౌరి అలంకరణ చేస్తారు. మంగళ గౌరి మహాదేవత. ఆ పరాశక్తిని పూజిస్తే అయిదోతనం కలకాలం నిలుస్తుందని పురాణాలు చెబుతున్నాయి.

### 8న



శరన్నవరాత్రుల్లో ఆరో రోజున (మంగళవారం) మహాలక్ష్మి అవతారంలో దర్శనమిస్తారు. లోక స్థితికారిణి, ధన, ధాన్య, ధైర్య, విద్య, సౌభాగ్య, సంతాన, గజలక్ష్ముల సమిష్టి రూపమై.. మహాలక్ష్మీదేవిగా భక్తులకు వరాలిస్తారు.

### 9న



ఏడో రోజు ఆశ్వయుజ శుద్ధ సప్తమి రోజున (బుధవారం) అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిస్తారు. ఈ రోజు మూలా నక్షత్రం ప్రత్యేకంగా అర్చకులు చెబుతుంటారు.

### 10న



ఆశ్వయుజ శుద్ధ అష్టమి (దుర్గాష్టమి) రోజున అమ్మవారు దుర్గాదేవిగా సకల జనులకు దర్శనమిస్తారు. దుర్గతులను రూపుమాపుతూ 'దుర్గముడు' అనే రాక్షసుణ్ణి అమ్మవారు సంహరించింది ఈ అష్టమి తిథి రోజునే. దేవి త్రిశూలం ధరించి సింహవాహనంపై అధిష్ఠించడంతో పాటు.. బంగారు కిరీటధారిణియై తన కాలికింద మహిషుణ్ణి తొక్కిపట్టి దర్శనమిస్తుంది.

### 11న



శరన్నవరాత్రుల్లో చివరి రోజున మహిషాసురమర్దినిగా అమ్మవారు దర్శనమిస్తారు. సింహ వాహనాన్ని అధిష్ఠించి, ఆయుధాలను ధరించే అమ్మవారు సకల దేవతా అంశాలతో మహాశక్తి రూపిణిగా భక్తులకు దర్శనమిస్తుంది. మహిషాసురుణ్ణి సంహరించిన మహిషాసురమర్దిని దేవిని పూజిస్తే శత్రు భయాలు తొలగి సకల విజయాలు సిద్ధిస్తాయి.

# అతివలు పట్టుదలతో సాధించారు కొలువు

పాల్వంచ, న్యూస్‌టుడే

కొందరికి ఆర్థిక ఇబ్బందులు.. మరికొందరికి సంసార బాధ్యతలు భారంగా మారాయి. అయినా వెరవలేదు. వారి లక్ష్యం ఒక్కటే.. ఉపాధ్యాయ కొలువు. నోటిఫికేషన్ వెలువడిన దరిమిలా యుద్ధప్రాతిపదికన సన్నద్ధమయ్యారు. ఉన్నంతలో ఏర్పాట్లు చేసుకుని ప్రణాళికతో ముందుకు సాగిన వారు కొందరైతే, శిక్షణతో సబ్జెక్టుపై పట్టుసాధించిన వారు మరికొందరు. వారందరి ఆశయం ఒక్కటే, అదే.. జిల్లాస్థాయి ర్యాంకు. రేయింబవళ్లు శ్రమించి అనుకున్నది సాధించారు. సోమవారం వెల్లడైన డీఎస్సీ సెకండరీ గ్రేడ్ టీచర్ ఫలితాల్లో మహిళా అభ్యర్థులు ఉత్తమ ర్యాంకులతో మెరిశారు. బుధవారం కొత్తగూడెంలో ప్రభుత్వ నియామకపత్రాల పరిశీలనకు హాజరైన సందర్భంగా 'న్యూస్‌టుడే' వారిని పలకరించింది.

### కష్టమే అనిపించినా.. పట్టుదలతో సన్నద్ధత: సౌమ్యశ్రీ



ఈ ఏడాది మార్చిలో డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడగానే పక్కా ప్రణాళికతో పరీక్షకు సిద్ధమయ్యాను. ప్రత్యేకంగా ఎలాంటి శిక్షణ తీసుకోలేదు. వివాహమై కుటుంబ బాధ్యతలుండటంతో.. సన్నద్ధతకు రోజువారీగా ప్రత్యేక సమయం కేటాయించా. స్వయంగా నోట్సు తయారు చేసుకుంటూ, సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకునేదాన్ని. ఎస్జీటీలో జిల్లాస్థాయిలో 28వ ర్యాంకు రావడం ఆనందంగా ఉంది. మాది అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు గ్రామం.

### ప్రత్యేక శిక్షణతో విజయం: రేణుక



డీఎస్సీ నోటిఫికేషన్ రాగానే ఏపీలోని అవనిగడ్డలో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నా. సబ్జెక్టుకు సంబంధించి కీలక అంశాలతో పక్కాగా నోట్సు రాసుకున్నా. పరీక్ష దగ్గరపడేకొద్దీ రేయింబవళ్లు శ్రమించా. జులైలో జరిగిన పరీక్షల ఫలితాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసింది. ఇంత త్వరగా నియామక పత్రాలు అందిస్తారని అస్సలు ఊహించలేదు. ఈ విజయం ఎంతో ఆనందాన్నిచ్చింది. ఎస్జీటీలో 56వ ర్యాంకు సాధించడంలో తల్లిదండ్రులు రాంచందర్, సోనాల ప్రోత్సాహం మరువలేనిది. మాది వ్యవసాయ కుటుంబం. సొంతూరు.. చంద్రుగొండ మండలంలోని మారుమూల వెంకట్యాతండా గ్రామం.

### భర్త, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..: ప్రగతి



ఉపాధ్యాయ కొలువే లక్ష్యంగా పెట్టుకున్నాను. ఈ ఏడాది నోటిఫికేషన్ రావడంతో ఎలాగైనా విజయం సాధించాలని పట్టుదలతో సన్నద్ధమయ్యా. ఈ క్రమంలో భర్త సతీశ్, తల్లిదండ్రులు కృష్ణ, ఉమారాణి ఎంతో ప్రోత్సహించారు. చివరకు అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నా. జిల్లా స్థాయిలో ఎస్జీటీలో 12వ ర్యాంకు రావడం సంతోషంగా ఉంది. మాది బూర్గంపాడు మండలం నకరిపేట ఏరియా.

### ఆర్థిక ఇబ్బందులున్నా శిక్షణ తీసుకున్నా: లహరి



నోటిఫికేషన్‌లో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు ఎక్కువగా ప్రకటించారు. దీంతో ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే తపనతో ఆర్థిక భారమైనప్పటికీ హైదరాబాద్ వెళ్లి ప్రత్యేక శిక్షణ తీసుకున్నా. ఒక పోస్టు నాదే అన్న ఆత్మవిశ్వాసంతో.. గట్టి పట్టుదలతో చదివా. చివరకు విజయం సాధించా. మాది పాల్వంచలోని రాహుల్‌గాంధీనగర్. తల్లిదండ్రులు.. దేవీలాల్, ఝాన్సీ. ఎస్జీటీ విభాగంలో జిల్లా స్థాయిలో 47వ స్థానం సొంతం కావడం ఆనందంగా ఉంది. త్వరలో కొలువు చేపడతా

## మొక్కల రాజశేఖర్, సీనియర్ సిటిజన్లకు సన్మానం



నుర్వి రాజశేఖర్ దంపతులకు సన్మానం

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: 'ప్రకృతి హరిత దీక్ష' చేబూని ఇటీవల మన్‌కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోదీ నుంచి ప్రశంసలు అందుకున్న పర్యావరణ ప్రేమికుడు.. కె.ఎన్.రాజశేఖర్, సీనియర్ సిటిజన్స్ బి.కృష్ణయ్య, పిల్లలమర్రి వరప్రసాద్, గొర్రె మల్లయ్యలను కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని ప్రకృతి ఆశ్రమంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఆశ్రమం కో-ఆర్డినేటర్ సుగుణరావు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## పూబెల్లిలో డిజిటల్ కార్డు సర్వే

ఇల్లెందు గ్రామీణం: డిజిటల్ కార్డు సర్వేకు పైలట్ ప్రాజెక్టుగా మండలంలోని పూబెల్లిని ప్రభుత్వం ఎంపిక చేసిందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య బుధవారం తెలిపారు. పట్టణ 19వ వార్డులోనూ ఈ సర్వే జరుగుతుందని మున్సిపల్ ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు చెప్పారు.

## సాగు భూములకు పట్టాలివ్వండి

టేకులపల్లి: బేతంపూడి రెవెన్యూ పరిధిలో సాగు భూములకు పట్టాలివ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు రేపాకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కుంటల్లలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

## సీపీఎం గ్రామశాఖ మహాసభలు

సుజాతనగర్, న్యూస్‌టుడే: వేలపగడ్డ సీపీఎం గ్రామశాఖ మహాసభ బుధవారం జరిగింది. జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య హాజరై మాట్లాడారు. మండల కార్యదర్శి రమేశ్, శ్రీకాంత్, శ్రీను, ఐలయ్య పాల్గొన్నారు.

ఇల్లెందు గ్రామీణం: సీపీఎం సుందరయ్యనగర్ శాఖ మహాసభ బుధవారం జరిగింది. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు హాజరైన ఈ కార్యక్రమంలో.. శాఖ కార్యదర్శిగా కొడెం బోస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ప్రతిపక్షాలపై దాడులు దుర్మార్గపు చర్య: భారాస

ఇల్లెందు గ్రామీణం: అంబర్‌పేట మూసీ నిర్వాసితులను పరామర్శించి వస్తున్న భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై దాడి దుర్మార్గపు చర్యగా ఆ పార్టీ వ్యవస్థాపక సభ్యులు దిండిగాల రాజేందర్ అభివర్ణించారు. ఇల్లెందులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతిపక్షాలపై భౌతికదాడులు సహేతుకం కాదన్నారు. సీనియర్ నాయకులు సిలువేరి సత్యనారాయణ, భావ్‌సింగ్, నబీ, రాజేశ్, శ్రీను, మహేందర్ పాల్గొన్నారు.

## నూతన కార్యాలయం ప్రారంభం

కొత్తగూడెం సింగరేణి: విద్యానగర్ కాలనీలో ఏఐటీయూసీ అనుబంధ భద్రాద్రి జిల్లా మార్బుల్స్, టైల్స్, గ్రానైట్ వర్కర్స్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా బుధవారం ప్రారంభించారు.

## తీరొక్క పూల సంబరం



కొత్తగూడెం కలెక్టరేట్: గణేష్ బస్తీలో అష్టలక్ష్ముల వేషధారణల్లో యువతులు



కొత్తగూడెం కలెక్టరేట్: కూలీలైన్ 35వ వార్డులో సంబురాల్లో మహిళలు



టేకులపల్లి కోదండ రామాలయంలో..



చుంచుపల్లి: విద్యానగర్‌కాలనీలో..

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కొత్తగూడెంలో పట్టణంలో బతుకమ్మ సంబురాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలిరోజు ఎంగిలి పూల బతుకమ్మను పేర్చి ఆటపాటలాడారు. ఉదయాన్నే గౌరమ్మకు పూజలు చేశారు. సాయంత్రం ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను పేర్చి నృత్యాలను చేశారు. అనంతరం నిమజ్జన వేడుక జరిపారు.

చుంచుపల్లి: విద్యానగర్‌కాలనీలో ఎమ్మెల్యే కూనంనేని నివాసం లైన్, పంచాయతీ కార్యాలయం వెనుక, మేదరబస్తీ 20 వార్డుల్లో బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

టేకులపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ ఆడపడుచుల బతుకమ్మ నేడొక విశ్వవ్యాప్త పండుగ అని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. టేకులపల్లిలో జరిగిన ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను బుధవారం ఆయన ప్రారంభించారు.



కొత్తగూడెంలో కొలువుదీరిన గౌరమ్మ



కొత్తగూడెంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రి వినాయక సెంటర్‌లో..



కొత్తగూడెం కలెక్టరేట్: పట్టణంలో పేర్చిన బతుకమ్మలు



ఇల్లెందు గ్రామీణం: ఆంబజార్‌లో..



టేకులపల్లి కోదండ రాముడి ఆలయంలో ఎమ్మెల్యే కోరం పూజలు



కొత్తగూడెం శ్రీనగర్‌లో..

## మాంసాహారం ఖననం.. మద్యం సీజ్

ఇల్లెందు గ్రామీణం, పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: గాంధీ జయంతి రోజు మాంసం విక్రయాలు నిర్వహిస్తున్న దుకాణాలపై మున్సిపల్ అధికారులు బుధవారం దాడిచేశారు. కబేళాలోని ఓ దుకాణంలో 30 కిలోల మేక మాంసం, మరో దుకాణంలో పది కిలోల చికెన్‌ను స్వాధీనం చేసుకుని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఖననం చేశారు. మరో ఘటనలో.. పాల్వంచ సబ్ స్టేషన్ ఏరియాలో గొలుసు దుకాణంపై ఎస్సై రాఘవయ్య దాడిచేసి రూ.5 వేల మద్యం సీజ్ చేశారు. నిర్వాహకురాలు లక్ష్మిపై కేసు నమోదు చేశారు.

## ఇసుక వాహనాల పట్టివేత

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టణ ఎస్సై సుమన్ బుధవారం పట్టుకున్నారు. మరో ఘటనలో పినపాక పట్టినగర్ నుంచి పాండురంగాపురానికి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గ్రామీణం ఎస్సై సురేశ్ పట్టుకున్నారు. వాహనాలను ఠాణాలకు తరలించి డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు.

## అనాథ శరణాలయాన్ని సందర్శించిన న్యాయమూర్తులు

కొత్తగూడెం న్యాయవిభాగం: గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా పట్టణంలోని జ్యోతి అనాథాశ్రమాన్ని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ ఛైర్మన్, జిల్లా జడ్జి పాటిల్ వసంత్, న్యాయమూర్తులు బుధవారం సందర్శించారు. అక్కడున్న వైద్య పరీక్షలు చేయించారు. న్యాయమూర్తులు జి.భానుమతి, బి.రామారావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, నిర్వాహకులు జ్యోతి, సామంత్ పాల్గొన్నారు.



అనాథ శరణాలయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్, ఇతర న్యాయమూర్తులు



ఇల్లెందు గ్రామీణం: మాట్లాడుతున్న న్యాయమూర్తి కీర్తి చంద్రికరెడ్డి

ఇల్లెందు గ్రామీణం: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరలిపల కీర్తి చంద్రికరెడ్డి అన్నారు. ఇల్లెందు సబ్‌జైల్‌లో మహాత్మాగాంధీ జయంతి, ఖైదీల దినోత్సవం సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. న్యాయవాదులు రవికుమార్, ఉమామహేశ్వరరావు, కీర్తి కార్తీక్, జైలు సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## దుకాణాల్లో తనిఖీలు

సుజాతనగర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని దుకాణాల్లో ఎస్సై జుబేదా బేగం ఆధ్వర్యంలో బుధవారం డాగ్‌స్క్వాడ్‌తో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థాల గుర్తింపునకు జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదేశాలతో తనిఖీలు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై రాఘవులు, వెంకటేశ్వర్లు, బృందం సభ్యులు నాగుల మీరా, శివశంకర్ పాల్గొన్నారు.

## అన్నదానం, నిత్యావసరాల పంపిణీ



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కోనేరు చిన్ని, నిర్వాహకులు

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: భాద్రపద అమావాస్య సందర్భంగా కొత్తగూడెం రైల్వే స్టేషన్ వద్ద వర్తక సంఘం, మార్వాడీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. జిల్లా కాంగ్రెస్ నాయకుడు కోనేరు సత్యనారాయణ హాజరై మాట్లాడారు. రామవరంలో కొదమసింహం పాండురంగాచార్యులు చేతుల మీదుగా బ్రాహ్మణులు, పేదలు, దివ్యాంగులకు నిత్యావసర వస్తువులు అందజేశారు.

# మహాత్ముడి అహింసా మార్గం అనుసరణీయం



పాల్వంచ: కేటీపీఎస్‌లో గాంధీకి నివాళులర్పిస్తూ..



పాల్వంచ: గాంధీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో...



ఇల్లెందు: భారాస నాయకులు..

కొత్తగూడెం పట్టణం, కొత్తగూడెం న్యాయవిభాగం, కొత్తగూడెం సింగరేణి: ప్రతి ఒక్కరూ మహాత్ముడి అహింసా మార్గంలో నడవాలని వక్తలు సూచించారు. కొత్తగూడెంలోని జిల్లా కోర్టు సమావేశ మందిరంలో జిల్లా జడ్జి పాటిల్ వసంత్, న్యాయమూర్తులు జి.భానుమతి, వి.రామారావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పించారు. కొత్తగూడెం పురపాలకంలో పారిశుధ్య జవాన్లను సత్కరించారు. ఛైర్‌పర్సన్ కె.సీతాలక్ష్మి, కమిషనర్ శేషు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బి.రోహిత్‌రాజు, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ జేబీ శౌరీ, ఎన్ఎస్‌యూఐ నాయకులు, రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓ రమేశ్, శేషగిరిభవన్, రామవరం సెంటర్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు. సింగరేణి పిల్లల పార్కులో స్కౌట్స్, గైడ్స్ ఆధ్వర్యంలో జీఎం పర్సనల్ శామ్యూల్ సుధాకర్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం సర్వమత ప్రార్థనలు, ప్రదర్శన చేపట్టారు. బీఎస్‌జీ సమన్వయకర్త సాయినిరంజన్, సీనియర్ రోవర్ స్కౌట్ లీడర్లు వెంకటస్వామి, గోపాలకృష్ణయ్య, రామస్వామి, బాగం శ్రీనివాసరావు, అశోక్ పాల్గొన్నారు.



కొత్తగూడెంలో పారిశుద్ధ్య జవాన్లకు సన్మానం

చుంచుపల్లి: బాబుక్యాంప్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన శ్రమదాన కార్యక్రమానికి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ హాజరై ఆవరణను శుభ్రం చేశారు. మొక్కను నాటారు. ప్రధాని మోదీ ప్రశంసలందుకున్న మొక్కల రాజశేఖర్‌ను అభినందించారు.

పాల్వంచ: పాల్వంచ కేటీపీఎస్ ఐదు, ఆరు దశల్లో మహిళా ఇంజినీర్లు, ఉద్యోగులు.. కాంగ్రెస్ ఆధ్వర్యంలో డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, నూకల రంగారావు గాంధీకి నివాళులర్పించారు.

ఇల్లెందు గ్రామీణం: ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఛైర్మన్ డీవీ నివాళులర్పించారు. పారిశుద్ధ్య కార్మికులకు రూ.5లక్షల బీమా కార్డులు అందజేశారు. మేనేజర్ అంకుషావలి, మాజీ ఛైర్‌పర్సన్ అనసూర్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జూలూరుపాడు: స్థానిక ఉన్నత పాఠశాలలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

టేకులపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు.

పాల్వంచపట్టణం: పెద్దమ్మతల్లి ఆలయం వద్ద నిర్వహించిన శ్రమదానంలో డీఆర్‌డీవో విద్యాచందన పాల్గొన్నారు.

కొత్తగూడెం సింగరేణి: సింగరేణి ప్రధాన వైద్యశాలలో చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ముఖ్యవైద్యాధికారి డా.సుజాత, వైద్యులు కె.నాగరాజు, వి.శ్రీనివాసరావు, చైతన్యకృష్ణ, జగదీశ్‌కుమార్, ఇందిరాకళ్యాణి, కృష్ణవేణి, ప్రభాకర్ పాల్గొన్నారు.



కొత్తగూడెం సింగరేణి: జాతిపితకు పూలమాల వేస్తున్న శామ్యూల్ సుధాకర్, స్కౌట్ మాస్టర్లు..



ఇల్లెందు పురపాలకంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఛైర్మన్ డీవీ తదితరులు..



కొత్తగూడెం కేంద్ర గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు మణిమృదుల, సిబ్బంది..



జూలూరుపాడు: ఆర్యవైశ్య సంఘం నాయకులు..



కొత్తగూడెం కలెక్టరేట్: రైతుబజార్ సెంటర్‌లో లాల్ బహదూర్ శాస్త్రికి వివిధ పార్టీల నాయకుల నివాళి